www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



TELANGANA RISING
CURE - PURE - RARE

EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:47 SATURDAY,JUNE 27,2026 PAGES:8 COST: 4 /-
ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 47 శనివారం 27 జూన్ 2026 పేజీలు :8 వెల: 4/-

## పెను భూకంపంతో విలవిల.. వణికిన వెనెజువెలా

జూన్ 26 హంసకలం వార్త

సెలవురోజు సాయంత్రం అంతా సందడిగా గడుపుతున్న సమయం ఒక్క నిమిషం కేవలం ఒకే ఒక్క నిమిషం వరుసగా రెండు భారీ ప్రకంపనలు ఎటు చూసినా విధ్వంసం పేకమేడల్లా కూలిన ఇళ్లు, భవనాలు దెబ్బతిన్న విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థలు జనం హాహాకారాలు శిథిలాల కింద నుంచి వినిపిస్తున్న ఆర్తనాదాలు.. - మిగతా2లో



## ఆపరేషన్ అమిస్తాడ్.. వెనెజువెలాకు భారత్ ఆపన్న హస్తం

జూన్ 26 హంసకలం వార్త

వెనెజువెలాలో ఇటీవల సంభవించిన భూకంపాలు భారీ ఆస్తి, ప్రాణ నష్టాన్ని మిగిల్చాయి. ఈ నేపథ్యంలో వెనెజువెలాను ఆదుకునేందుకు భారత్ ఆపరేషన్ అమిస్టాడ్‌ను ప్రారంభించింది. స్పానిష్ భాషలో అమిస్టాడ్ అంటే స్నేహం. భూకంప బాధితులను ఆదుకునేందుకు వీలుగా ఒక -మిగతా2లో



## రామ జన్మభూమి ట్రస్ట్ అవినీతి వ్యవహారంలో వాస్తవాలు చెప్పాల్సిందే



2

- యోగి ఆదిత్యనాథ్ సీఎం పదవికి రాజీనామా చేయాలని చామల డిమాండ్
- విరాళాల సొమ్ముతో బీజేపీ రాజకీయాలు చేస్తోందని మండిపాటు
- మమత, థాకరేలకు చెందిన ఎంపీలను ఈ సొమ్ముతోనే కొనుగోలు చేశారని ఆరోపణ

## డ్రగ్స్ పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: సీఎం రేవంత్

జూన్ 26 హంసకలం వార్త

సమాజాన్ని డ్రగ్స్ నాశనం చేస్తాయి. డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు కీలక సందేశాన్ని ఇచ్చారు. తెలంగాణను డ్రగ్స్ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల మహమ్మారి కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, వారి కుటుంబాలతో పాటూ మొత్తం సమాజాన్నే నాశనం చేస్తుందన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా యువత ఎల్లప్పుడూ వీటికి దూరంగా ఉండాలని సీఎం హితవు పలికారు.

-మిగతా2లో



## మంత్రి లోకేశ్ తో సమావేశం... ఆసక్తికరమైన అంశాలను వెల్లడించిన టీచర్లు



జూన్ 26 హంసకలం వార్త

సింగపూర్ విద్యావిధానం అత్యంత క్రమశిక్షణతో, విజ్ఞానదాయకంగా ఉందని, అక్కడి విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా ఎంతో బాధ్యతగా వ్యవహరిస్తున్నారని ఇటీవల సింగపూర్ అధ్యయన యాత్రకు వెళ్లివచ్చిన ఉత్తమ ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ యాత్రకు వెళ్లిన 37 మంది ఉపాధ్యాయులు శుక్రవారం ఉండవల్లిలోని నివాసంలో రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సింగపూర్‌లో తాము గమనించిన అంశాలను, వాటిని రాష్ట్రంలో అమలు చేసే అవకాశాలను వారు మంత్రికి వివరించారు. -మిగతా2లో

## వైరల్ అవుతున్న చిన్నారి ఆర్ణ వీడియో.. నవ్వకుండా ఉండలేరన్న సీఎం చంద్రబాబు

- సోషల్ మీడియాలో వైరల్ అయిన 'ఐఏఎస్' ఆర్ణ వీడియో
- వెంకటేశ్ సినిమా డైలాగుతో వీడియో పోస్ట్ చేసిన తండ్రి
- ఆర్ణ వీడియోపై ఇన్స్టాలో స్పందించిన సీఎం చంద్రబాబు
- వీడియో చూసి నవ్వకుండా ఉండలేరంటూ సరదా కామెంట్
- చిన్నారి ఆర్ణకు తన మద్దతు ఉంటుందని వెల్లడి




2

## ప్రైవేటు కాలేజీల్లో ఫీజుల వసూలు.. ప్రభుత్వానికి విజయశాంతి కీలక ప్రతిపాదన

జూన్ 26 హంసకలం వార్త

తెలంగాణలోని ప్రైవేట్ కాళాశాలల యాజమాన్యాలు ఫీజులు వసూళ్లతో పాటు, కనీస విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించేలా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ, సీనియర్ నేత విజయశాంతి డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులను ఆయా కళాశాలల్లో విద్యా నాణ్యత, ప్రమాణాల అమలుతో ముడిపెట్టాలని ఆమె -మిగతా2లో



## రేవంత్ సర్కార్ పై రాంచందర్ రావు ఫైర్



2

హంస కలం వార్త HAMSA KALAM VARTA
శనివారం 27 జూన్ 2026

## డ్రగ్స్ పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: సీఎం రేవంత్

డ్రగ్స్ బారిన పడకుండా యువత ఎల్లప్పుడూ వీటికి దూరంగా ఉండాలని సీఎం హితవు పలికారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, అందుకోసం వారు స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం చట్టాలు, పోలీసుల చర్యల వల్లే కాకుండా.. ప్రజల్లో సరైన అవగాహన పెంచడం ద్వారానే మాదక ద్రవ్యాల నియంత్రణ పూర్తిగా సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అక్రమ డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా భావించి సహకరించాలని కోరారు. యువత డ్రగ్స్ వైపు వెళ్లకుండా ఉండేందుకు.. వారిలో సానుకూల ఆలోచనలు, నైతిక విలువలను పెంపొందించడం ఎంతో ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాల వల్ల జరిగే నష్టాలపై నిరంతరం అప్రమత్తత పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహమ్మారిని రూపుమాపడానికి అందరం కలిసికట్టుగా చేసే సమిష్టి పోరాటమే శాశ్వత పరిష్కారమని, డ్రగ్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రతి పౌరుడూ నడుం బిగించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## ప్రైవేటు కాలేజీల్లో ఫీజుల వసూలు.. ప్రభుత్వానికి విజయశాంతి కీలక ప్రతిపాదన

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులను ఆయా కళాశాలల్లో విద్యా నాణ్యత, ప్రమాణాల అమలుతో ముడిపెట్టాలని ఆమె సూచించారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన మధ్యంతర ఆదేశాలను విజయశాంతి స్వాగతించారు. అయితే, ప్రభుత్వ చెల్లింపులు, విద్యార్థుల నుంచి ఫీజుల వసూళ్ల కోసం ఆరాటపడే యాజమాన్యాలు, నాణ్యమైన విద్యను, కనీస వసతులను అందించడంలో విఫలమవుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "ఫీజులు వసూలు చేసే హక్కు ప్రైవేట్ యాజమాన్యాలకు ఉన్నప్పటికీ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే బాధ్యతను కూడా వారు విధిగా నెరవేర్చాలి" అని ఆమె స్పష్టం చేశారు. గతంలో విజిలెన్స్ కమిషన్ సమర్పించిన నివేదిక సైతం పలు ప్రైవేట్ కళాశాలల్లో సరైన వసతులు లేవని స్పష్టం చేసిన విషయాన్ని విజయశాంతి గుర్తుచేశారు. ఈ అంశాన్ని తాను ఇదివరకే శాసనమండలి లో సైతం ప్రస్తావించినట్లు ఆమె తెలిపారు. ప్రజాధనంతో చెల్లించే రీయింబర్స్‌మెంట్ నిధులు విద్యార్థుల భవిష్యత్తుకు నిజమైన ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ప్రభుత్వ నిబంధనలను పాటించని విద్యా సంస్థల పై కాంగ్రెస్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## రేవంత్ సర్కార్ పై రాంచందర్ రావు ఫైర్

తుంగభద్ర ప్రాజెక్టు నుంచి తెలంగాణకు కేటాయించిన నీటి వాటాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టతనివ్వాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ఇటీవల కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌తో జరిగిన చర్చల్లో ఏయే అంశాలను ప్రస్తావించారో వివరాలను బహిర్గతం చేయాలని ఆయన కోరారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కర్ణాటకలోని హోసపేటలో ఉన్న తుంగభద్ర డ్యామ్‌కు ఇటీవల 33 కొత్త స్పిల్‌వే గేట్లను అమర్చిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ముఖ్యమంత్రులతో పాటు కేంద్ర మంత్రి సి.ఆర్. పాటిల్ హాజరయ్యారు. గేట్ల ఏర్పాటును స్వాగతిస్తున్నామని, అయితే తెలంగాణకు దక్కాల్సిన నీటి కేటాయింపులపై కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని రామచంద్రరావు సూచించారు. రెండు కీలక ప్రాజెక్టుల కింద తెలంగాణకు 15.9 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా, అధికారిక లెక్కల ప్రకారం కేవలం 5 టీఎంసీలు మాత్రమే అందుతున్నాయని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి దక్కాల్సిన వాటా కంటే తక్కువ నీటికి గతంలో కేసీఆర్ సంతకం చేశారని ఆయన ఆరోపించారు. 'సర్' ప్రక్రియపై హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలను రామచందర్ రావు తీవ్రంగా ఖండించారు. బీజేపీ ఐడీ కార్డు ఉంటేనే 'ఎస్ఐఆర్' చెల్లుతుందా? పాస్‌పోర్ట్ చెల్లదా? అని ఒవైసీ ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. పాస్‌పోర్ట్ అనేది ట్రావెల్ డాక్యుమెంట్ మాత్రమేనని, అది పౌరసత్వానికి నిరూపణ కాదని 2013లో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా గుర్తు చేశారు. దలైలామా వద్ద కూడా ఎల్లో పాస్‌పోర్ట్ ఉందని, అంతమాత్రాన ఆయనకు భారత పౌరసత్వం ఉన్నట్లు కాదని పేర్కొన్నారు. 'సర్' ప్రక్రియలో గుర్తింపు కోసం 12 రకాల ధృవీకరణ పత్రాలను సమర్పించే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు.

## మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ పై కొనసాగుతున్న ఉత్కంఠ

జూన్ 26 హంసకలం వార్త

కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ పై ఉత్కంఠ కొనసాగుతోంది. జూన్ 28 లేదా జూన్ 29వ తేదీన కేంద్ర మంత్రి వర్గ పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ద్రౌపది ముర్ముతో మంత్రివర్గ విస్తరణకు అనుకూలమైన తేదీలపై ఆయన చర్చించినట్లు తెలుస్తుంది. కొత్త మంత్రివర్గంలోకి ఆర్బీఐ మాజీ గవర్నర్, ప్రధాని ముఖ్య కార్యదర్శి శక్తి కాంత దాస్‌కు మంత్రివర్గంలో స్థానం దక్కే అవకాశం ఉందని సమాచారం. అలాగే ప్రస్తుత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శాఖ మారుస్తారనే ప్రచారం సాగుతోంది. ఆమెకు విద్యాశాఖ కేటాయిస్తారనే చర్చ నడుస్తోంది. కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్‌ను మళ్లీ మంత్రివర్గంలోకి తీసుకుంటారు. ఎన్‌డీఏకు మద్దతు ఇచ్చిన శివసేనకు ఈ మంత్రివర్గంలో చోటు లభించే అవకాశం ఉంది. అందుకోసం ప్రస్తుత ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరిని కేబినెట్ నుంచి తప్పించే అవకాశం ఉంది. పంజాబ్‌లో పార్టీ బలోపేతం కోసం రవ్‌నీత్ బిట్టు స్థానంలో తరుణ్ చుగ్‌కు స్థానం కల్పించనున్నారు. కేంద్ర మంత్రి ప్రతాప్ రావు జాదవ్‌తోపాటు మనోహర్ లాల్ ఖట్టర్ శాఖలు మార్చే అవకాశం ఉంది.

# రామ జన్మభూమి ట్రస్ట్ అవినీతి వ్యవహారంలో వాస్తవాలు చెప్పాల్సిందే

అయోధ్య రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ విరాళాల అవకతవకలపై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. అయోధ్య రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్‌కు సంబంధించి ఎలాంటి అవినీతి జరగలేదని కార్యదర్శి చంపత్ రాయ్ చెప్పారని.. కానీ యూపీ సిట్ పోలీసులు చంపత్ రాయ్ మనుషులను అరెస్టు చేశారన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజల సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని విరాళాలు వసూలు చేశారని అన్నారు. చంపత్ రాయ్‌ను ట్రస్ట్ కార్యదర్శి పదవి నుంచి తప్పించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. యూపీ సీఎం పదవికి యోగి ఆదిత్య నాథ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇది యూపీకి సంబంధించిన వ్యవహారం కాదని.. దేశ ప్రజలకు సంబంధించిన అంశమన్నారు. అయోధ్య రామ జన్మభూమి ట్రస్ట్ పేరుతో రూ.200 కోట్లు అవినీతి చేశారని ఎంపీ ఆరోపణలు చేశారు. రాముడి పేరు చెప్పి వసూలు చేసిన డబ్బుతో ఏం చేస్తున్నారో బీజేపీ ప్రజలకు చెప్పాలన్నారు. బెంగాల్‌లో మమతా బెనర్జీ ఎంపీలు 20 మందిని, మహారాష్ట్రలో శివసేన ఉద్దవ్ థాక్రే ఎంపీలు 6 మందిని.. ఒక్కొక్కరికీ రూ.75 కోట్లు ఇచ్చి బీజేపీ కొనుగోలు చేసిందంటూ వ్యాఖ్యానించారు. రామ జన్మభూమి ట్రస్ట్ అవినీతి వ్యవహారంలో ప్రధాని మోదీ, అమిత్ షా, యోగీ ఆదిత్య నాథ్ ప్రజలకు వాస్తవాలు చెప్పాలన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కాపాడారని చామల మండిపడ్డారు. చంపత్ రాయ్, అనిల్ మిశ్రాను పదవి నుంచి తప్పించి చేతులు దులుపుకుంటే సరిపోదన్నారు. దేశంలో ప్రజలు ఏ స్థితిలో ఉన్నా అయోధ్య రామ మందిరం నిర్మాణం కోసం విరాళాలు ఇచ్చారన్నారు. 'ప్రజలు దేవుడి కోసం డబ్బులు ఇచ్చారు. మీరు దోచుకోవడం కోసం కాదు' అంటూ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# అపరేషన్ అమిస్తాడ్.. వెనెజువెలాకు భారత్ ఆపన్న హస్తం

భూకంప బాధితులను ఆదుకునేందుకు వీలుగా ఒక ఫీల్డ్ హాస్పిటల్ యూనిట్‌తో పాటు ఇతర సహాయక సామగ్రిని రెండు సీ17 ట్రాన్స్‌పోర్టు విమానాల్లో పంపించింది. మొత్తం 35 టన్నుల సామగ్రిని పంపించామని విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందించే తొలిదేశంగా భారత ప్రతిష్ఠ ఈ ఆపరేషన్‌తో ఇనుమడించిందని అన్నారు. క్షతగాత్రులకు వైద్యసాయం సాయం అందించేందుకు ఆర్మీ ప్రత్యేక మెడికల్ బృందాన్ని ఇప్పటికే పంపించామని భారత ఆర్మీ తెలిపింది. పారాఫీల్డ్ ఆర్మీకి చెందిన 41 మంది మెడికల్ సిబ్బంది ఉన్నారని ఆర్మీ వర్గాలు చెప్పాయి. వీరులో 9 మంది మెడికల్ ఆఫీసర్లు కూడా ఉన్నారని వెల్లడించాయి. వెనెజువెలాలో ఈ బృందం ఎమర్జెన్సీ వైద్య కేంద్రాలు ఏర్పాటు చేసి క్షతగాత్రులకు వైద్యం అందిస్తుంది. ట్రామా మేనేజ్‌మెంట్, ఎమర్జెన్సీ సర్జరీల వంటి క్రిటికల్ వైద్య సేవలు అందించడం ఈ బృందం ప్రత్యేకత అని ఆర్మీ వర్గాలు తెలిపాయి. క్షతగాత్రులకు అత్యవసర వైద్య సాయం అందించేందుకు ఉద్దేశించిన ప్రత్యేక ఫీల్డ్ ఆసుపత్రిని కూడా భారత్ పంపించింది. ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులకు తక్షణసాయం అందించే తాత్కాలిక ఆసుపత్రిగా ఈ మాడ్యులార్ వైద్య కేంద్రం ఉపయోగపడుతుంది. ఈ ఆసుపత్రిలో ఒకేసారి 200 మందికి వైద్య సేవలు అందించే అవకాశం ఉంది. పోర్టబుల్ వెంటిలేటర్లు, పేషెంట్ మానిటర్లు, డయాగ్నస్టిక్ సాధనాలు, ఆక్సిజన్ సరఫరా వ్యవస్థలు, విద్యుత్ సరఫరా వ్యవస్థ వంటి అన్ని వసతులు ఈ కేంద్రంలో ఉంటాయి. గతంలో ప్రకృతి విపత్తుల సమయంలో భారత్ ఇదే విధంగా పొరుగు దేశాలకు సాయం అందించింది. ఇక వెనెజువెలాలో మరణాల సంఖ్య 235కు చేరింది. మరో 4,300 మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని స్థానిక అధికారులు చెబుతున్నారు.

# పెను భూకంపంతో విలవిల..వణికిన వెనెజువెలా

ఈ విషాదంలో వందలాది మంది మరణించగా, వేలాది మంది గాయపడ్డారు. శిథిలాల కింద వేలాది మంది చిక్కుకున్నారు. దీనితో ప్రాణనష్టం భారీగా ఉండే అవకాశం ఉందనే అంచనాలు వెలువడుతున్నాయి. గల్లంతైన, ఆచూకీ తెలియనివారి కోసం వెనెజువెలా నిర్వహించే వెబ్‌సైట్‌కు.. భూకంపం తర్వాత గురువారం రాత్రి వరకల్లా 28 వేల మందికిపైగా కనిపించడం లేదంటూ అభ్యర్థనలు అందాయి. భూకంపంతో లా గువైరా ప్రాంతం, రాజధాని కరాకస్ అతలాకుతలంకాగా, మోరన్, ఫాల్కన్ తదితర పట్టణాల్లోనూ తీవ్ర నష్టం జరిగింది. వందలాది భవనాలు కూలిపోయాయి. వేలాది భవనాలు బీటలువారి కూలిపోయే దశలో ఉన్నాయి. విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. పలు ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడ్డాయి.

**సెలవు రోజు.. సాయంత్రం సందడి మధ్య..**

వెనెజువెలాలో బుధవారం సెలవురోజు.. అంతా సందడిగా గడుపుతున్నారు. సాయంత్రం 6.04 గంటల సమయంలో (భారత కాలమానం ప్రకారం గురువారం తెల్లవారు జామున 3.30 గంటలకు) రిక్టర్ స్కేల్‌పై 7.2 తీవ్రతతో ఒక్కసారిగా భూమి కంపించింది. ఆ ప్రకంపనలు ఆగీ ఆగకముందే కేవలం నిమిషంలోపే మరింత ఉధృతంగా 7.5 తీవ్రతతో మరో భారీ భూకంపం వచ్చింది. ఇళ్లు, హోటళ్లు, రెస్టారెంట్లు.. ఇలా ఎక్కడ, ఎలా ఉన్నవాళ్లు అలా బయటికి పరుగెత్తారు. రెండు భారీ భూకంపాల తర్వాత కూడా స్వల్పస్థాయి ప్రకంపనలు కొనసాగాయి. దీనితో ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు ఆందోళనతో బుధవారం రాత్రంతా వీధుల్లో, పార్కుల్లో, రోడ్ల పక్కన పార్క్ చేసిన కార్లలో ఉండిపోయారు. వెనెజువెలా రాజధాని కరాక్సలోని సిమోన్ బొలివర్ ప్రధాన విమానాశ్రయం దెబ్బతినడంతో మూసివేశారు. భూకంపంతో గురువారం మధ్యాహ్నం వరకు 164 మృతదేహాలను వెలికితీశామని, 971 మంది గాయపడ్డారని వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగెజ్ వెల్లడించారు. శిథిలాల తొలగింపు, సహాయక చర్యలు వేగంగా సాగుతున్నట్టు తెలిపారు. వెనెజువెలాలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. దెబ్బతిన్న ఇళ్లు, ఆస్పత్రుల పునర్నిర్మాణం కోసం వెంటనే సుమారు రూ.1,890 కోట్ల (200 మిలియన్ డాలర్ల)తో ఫండ్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.

**బ్రెజిల్ వరకు ప్రకంపనల తీవ్రత**

వెనెజువెలాలో గత వందేళ్ల లో సంభవించిన అతి భారీ భూకంపం ఇదే కావడం గమనార్హం. ఈ ప్రకంపనల తీవ్రత వెనెజువెలాతోపాటు చుట్టుపక్కల ఉన్న కొలంబియా, బ్రెజిల్ సహా పలు దేశాల్లోనూ కనిపించింది. కరాక్సకు 1,700 కిలోమీటర్ల దూరంలోని బ్రెజిల్ పట్టణాలు మనౌస్, బెలెం, మకాపాలలో జనం ఇళ్లలోకి బయటికి పరుగెత్తారు. భూకంపంతో వెనెజువెలాలోని తీరప్రాంత పట్టణం లా గువైరాలో తీవ్రస్థాయిలో విధ్వంసం జరిగింది. పెద్ద సంఖ్యలో భవనాలు కూలిపోయాయి. దీనితో లా గువైరాను 'విపత్తు ప్రాంతం (డిజాస్టర్ జోన్)'గా ప్రకటించి.. భారీ స్థాయిలో సహాయక చర్యలు చేపట్టారు. తీరానికి సమీపంలో ఉన్న ప్రముఖ 'హోటల్ ఎడ్వర్డ్' పూర్తిగా కుప్పకూలి, శిథిలాల దిబ్బగా మారిపోయింది. ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఉండే ఈ పది అంతస్తుల భవనంలో పార్టీలు, సమావేశాలు ఎక్కువగా జరుగుతుంటాయని.. అందులో ఎంతమంది చిక్కుకుపోయారో తెలియదని వెనెజువెలా అధికారులు తెలిపారు. ఇక ఆస్పత్రులు కూడా దెబ్బతినడం, విద్యుత్ సరఫరా లేకపోవడంతో క్షతగాత్రులకు చికిత్స అందించడంలో ఇబ్బంది ఎదురవుతోంది. లా గువైరాలో ఆస్పత్రుల బయట, వీధుల్లోనే చికిత్సలు అందిస్తున్న దృశ్యాలు కలిచివేస్తున్నాయి. చాలా చోట్ల విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతినడంతో.. ఏం జరుగుతోందో, తమవారి పరిస్థితి ఎలా ఉందో తెలియక ప్రజలు ఆందోళనలో చిక్కుకుపోయారు.

## మంత్రి లోకేశ్ తో సమావేశం... ఆసక్తికరమైన అంశాలను వెల్లడించిన టీచర్లు

సింగపూర్‌లో ఉపాధ్యాయులు ప్రతి వారం సమావేశమై సబ్జెక్టుల వారీగా చర్చించుకోవడం, వారి మధ్య సమన్వయం అద్భుతంగా ఉందని టీచర్లు తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి లోకేశ్, రాష్ట్రంలో విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచేందుకే చాగంటి కోటేశ్వరరావు గారు రూపొందించిన పాఠ్యాంశాలను ప్రవేశపెట్టామని గుర్తుచేశారు. తాను చదివిన స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ఫైనల్ పరీక్షలకు ఇన్విజిలేటర్లు ఉండరని, 'ఆనర్ కోడ్' అనే స్వీయ క్రమశిక్షణ పాటిస్తారని, అందుకే ఎవరూ కాపీయింగ్ వంటివి చేయరని ఉదహరించారు. 'తల్లికి చెప్పలేని పని చేయొద్దు' అన్న చాగంటి గారి మాటలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయని లోకేశ్ అన్నారు.

**వివిధ జిల్లాల ఉపాధ్యాయుల సూచనలు**

భీమిలికి చెందిన హెచ్‌ఎం తిరుమల శ్రీదేవి మాట్లాడుతూ.. సింగపూర్‌లో 'వెల్‌నెస్ అంబాసిడర్స్', 'మెంటల్ హెల్త్ కౌన్సిలర్'ల నియామకం ద్వారా ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంచుతున్నారని తెలిపారు. సీనియర్ టీచర్లు జూనియర్లకు మార్గనిర్దేశం చేయడం, పాఠశాల స్థాయిలో 'వెల్ బీయింగ్ కమ్యూనిటీస్', నెలవారీ కాంప్లెక్స్ మీటింగ్‌లు, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ వర్క్‌షాపులు, టీచర్ల విజయాలను వేడుకగా జరపడం వంటివి వారిని ప్రోత్సహిస్తున్నాయని వివరించారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ ప్రిన్సిపాల్ జాన్సన్ దేవరాజ్ మాట్లాడుతూ.. సింగపూర్‌లో విద్యార్థులు 'ప్రైమరీ స్కూల్ లెర్నింగ్ ఎగ్జామినేషన్'లో మంచి మార్కులు సాధిస్తేనే 6వ తరగతిలో సమీపంలోని మంచి పాఠశాలలో సీటు లభిస్తుందని చెప్పారు. ఈ విధానాన్ని రాష్ట్రంలో అమలు చేస్తే ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల స్థాయిలో నాణ్యత పెరుగుతుందని సూచించారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ, విద్యార్థులు ఒత్తిడిని తట్టుకోగలరా అనే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు.

## వైరల్ అవుతున్న చిన్నారి ఆర్ణ వీడియో.. నవ్వకుండా ఉండలేరన్న సీఎం చంద్రబాబు

సోషల్ మీడియాలో 'ఐఏఎస్ ఆర్ణ'గా ఎంతో గుర్తింపు పొందిన ఓ చిన్నారి పోస్ట్ చేసిన వీడియోపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సరదాగా స్పందించారు. ఈ వీడియోను చూసి నవ్వకుండా ఉండలేరంటూ ఆయన వ్యాఖ్యానించారు. చిన్నారి ఆర్ణకు తన పూర్తి మద్దతు ఉంటుందని కూడా ఆయన హామీ ఇచ్చారు. ఇటీవల ఆర్ణ తండ్రి తన కుమార్తెకు సంబంధించిన ఓ వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. నటుడు వెంకటేశ్ సినిమాలోని డైలాగులను బ్యాక్‌గ్రౌండ్‌లో జతచేసి ఈ వీడియోను రూపొందించారు. తన క్యూట్ హావభావాలతో ఆర్ణ ఆకట్టుకోవడంతో ఈ వీడియో క్షణాల్లో వైరల్ అయింది. లక్షలాది మంది నెటిజన్లు ఈ వీడియోను చూసి మురిసిపోయారు. ఈ వైరల్ వీడియో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా వెళ్లింది. దీనిపై ఆయన తన అధికారిక ఇన్స్టాగ్రామ్ ఖాతాలో స్పందించారు. "సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న చిన్నారి ఐఏఎస్ ఆర్ణ వీడియో చూసి నవ్వకుండా ఉండలేరు" అని పోస్ట్ చేశారు. అంతేకాకుండా ఆర్ణకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని కూడా ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి స్పందనతో ఈ వీడియో ఇప్పుడు మరింతగా ట్రెండ్ అవుతోంది. ఇప్పటికే సోషల్ మీడియా స్టార్‌గా ఉన్న ఆర్ణకు, సీఎం నుంచి ప్రశంసలు దక్కడం విశేషం.

# సంపాదకీయం

## నిజంగానే భారత్ ఆర్థిక సంక్షోభంలో ఉందా?

భారత ఆర్థిక వ్యవస్థ గురించి ప్రస్తుతం రెండు విభిన్న కథనాలు వినిపిస్తున్నాయి. ఒకటి-- ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ దూసుకుపోతోందనే వాదన. మరొకటి-- నిరుద్యోగం, ధరల భారం, ఆదాయ అసమానతలతో సామాన్య ప్రజలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారనే విమర్శ. ఈ రెండిటిలో ఏది నిజం? ప్రస్తుతం భారత్‌ను ఆర్థిక సంక్షోభంలో ఉన్న దేశంగా పేర్కొనడానికి అవసరమైన పరిస్థితులు కనిపించడం లేదు. ఆర్థిక సంక్షోభం అంటే-- వృద్ధిరేటు కుప్పకూలడం, విదేశీ మారక నిల్వలు క్షీణించడం, కరెన్సీ విలువ తీవ్రంగా పడిపోవడం, బ్యాంకింగ్ వ్యవస్థ దెబ్బతినడం, ద్రవ్యోల్బణం అదుపు తప్పడం వంటి లక్షణాలు ఒకేసారి కనిపించాలి. కానీ అలాంటి పరిస్థితి లేదు. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, ఆర్బీఐ అంచనాల ప్రకారం భారత ఆర్థిక వృద్ధి రేటు 6శాతం కంటే ఎక్కువగా కొనసాగుతోంది. అమెరికా, జర్మనీ, జపాన్, బ్రిటన్ వంటి పెద్ద ఆర్థిక వ్యవస్థలు మందగమనాన్ని ఎదుర్కొంటున్న సమయంలో భారత్ ఈ స్థాయి వృద్ధిని కొనసాగించడం గమనార్హం. దేశ జీడీపీ ఇప్పటికే నాలుగు ట్రిలియన్ డాలర్ల మార్కును దాటగా, వచ్చే కొన్నేళ్లలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించే అవకాశం ఉందని అంతర్జాతీయ సంస్థలు అంచనా వేస్తున్నాయి. అయితే జీడీపీ పెరుగుదల మాత్రమే ఆర్థిక ఆరోగ్యానికి పూర్తి సూచిక కాదు. అసలు ప్రశ్న ఏమిటంటే.. ఈ వృద్ధి ఫలితాలు ఎంతమంది ప్రజల జీవితాల్లో కనిపిస్తున్నాయి? ఇక్కడే భారత ఆర్థిక వ్యవస్థలోని ప్రధాన వైరుధ్యం బయటపడుతోంది. దేశ స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయిల్లో ఉన్నాయి. కార్పొరేట్ లాభాలు పెరుగుతున్నాయి. విదేశీ పెట్టుబడులు కొనసాగుతున్నాయి. మౌలిక సదుపాయాల నిర్మాణం వేగంగా జరుగుతోంది. కానీ అదే సమయంలో విద్య, వైద్యం, గృహనిర్మాణం, ఆహార వ్యయాలు మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్‌ను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. అధికారిక ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉన్నప్పటికీ, కుటుంబాల నెలవారీ ఖర్చులు మాత్రం తగ్గడం లేదు. అందుకే గణాంకాలు ఒకటి చెబితే, ప్రజల అనుభవాలు మరొకటి చెబుతున్నాయి. భారత్ ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు నిరుద్యోగం కంటే నాణ్యమైన ఉపాధి కొరత. ప్రతి సంవత్సరం కోట్లాది మంది యువత ఉద్యోగ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నా, వారి విద్యార్హతలకు తగిన ఉద్యోగాల సృష్టి జరగడం లేదు. ఉన్నత విద్య పూర్తి చేసిన అనేక మంది యువకులు తక్కువ వేతనాలతో పనిచేయడం లేదా ప్రభుత్వ ఉద్యోగాల కోసం సంవత్సరాల పాటు ఎదురుచూడడం సాధారణం అయింది. ఇది కేవలం ఉపాధి సమస్య కాదు; దేశ మానవ వనరుల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోలేకపోతున్నామనే సంకేతం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి కూడా మిశ్రమంగానే ఉంది. వ్యవసాయం ఇంకా కోట్లాది కుటుంబాలకు ప్రధాన జీవనాధారం. కానీ వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, అస్థిర మార్కెట్ ధరలు రైతుల ఆదాయాలను ప్రభావితం చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం ఆశించిన స్థాయిలో పెరగకపోవడం దేశీయ డిమాండ్‌పై ప్రభావం చూపుతోంది. ఒక ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండాలంటే పట్టణాలతో పాటు గ్రామీణ మార్కెట్లు కూడా బలోపేతం కావాలి. ఇక ఆదాయ అసమానత... గత దశాబ్దంలో భారత్‌లో సంపద సృష్టి వేగవంతమైంది. అయితే ఆ సంపద పంపిణీ సమానంగా జరగలేదనే విమర్శలున్నాయి. కొద్దిమంది చేతుల్లో భారీ సంపద కేంద్రీకృతమవగా, అధిక జనాభా ఇంకా పరిమిత ఆదాయాలతో జీవిస్తోంది. దీర్ఘకాలంలో ఇది సామాజిక, ఆర్థిక సవాళ్లకు దారితీసే అవకాశం ఉంది. ఎందుకంటే స్థిరమైన వృద్ధికి విస్తృతమైన మధ్యతరగతి, బలమైన కొనుగోలు శక్తి అవసరం. అయితే ఆశాజనక అంశాలు కూడా తక్కువ కావు. విదేశీ మారక నిల్వలు బలంగా ఉన్నాయి. బ్యాంకింగ్ రంగం గతంతో పోలిస్తే ఆరోగ్యకర స్థితిలో ఉంది. డిజిటల్ చెల్లింపులు, తయారీ రంగ విస్తరణ, స్టార్టప్, ఎకోసిస్టమ్, మౌలిక సదుపాయాల పెట్టుబడులు భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయి. ప్రపంచ సరఫరా గొలుసుల్లో చైనాకు ప్రత్యామ్నాయంగా భారత్‌ను చూడాలనే ఆసక్తి కూడా పెరుగుతోంది. కాబట్టి భారత్ ప్రస్తుతం ఆర్థిక సంక్షోభం అంచున నిలిచిన దేశం కాదు. అదే సమయంలో అన్ని సమస్యలను అధిగమించి సంపూర్ణ విజయాన్ని సాధించిన దేశం కూడా కాదు. ఇది ఒక పరివర్తన దశ. వృద్ధి ఉంది, కానీ అది అందరికీ సమానంగా చేరడం లేదు. అవకాశాలు ఉన్నాయి, కానీ వాటిని ఉపాధి, ఆదాయం, జీవన నాణ్యతగా మార్చే సవాలు ఇంకా మిగిలే ఉంది. అందువల్ల నేటి భారత ఆర్థిక వ్యవస్థపై అడగాల్సిన ప్రశ్న 'జీడీపీ ఎంత పెరిగింది?' అని కాదు. 'సామాన్య భారతీయుడి జీవితం ఎంత మెరుగుపడింది?' అని. ఆ ప్రశ్నకు ధైర్యంగా, గర్వంగా సమాధానం చెప్పగలిగిన రోజే భారత్ కేవలం పెద్ద ఆర్థిక వ్యవస్థగా కాకుండా, నిజమైన ఆర్థిక మహాశక్తిగా గుర్తింపు పొందుతుంది.

# ఫిరాయింపులు: భలే ఖరీదైన బేరాలు!








కాల వైపరీత్యం! నిన్నటిదాకా తాము విమర్శించిన పార్టీలోనే నేడు చేరిపోతున్న ప్రజాప్రతినిధుల సంఖ్య పెరిగిపోతోంది. ఇటీవల బెంగాల్, మహారాష్ట్రలో చోటుచేసుకున్న తృణమూల్ కాంగ్రెస్, శివసేన ఎమ్మెల్యే, ఎంపీల ఫిరాయింపులే అందుకు నిదర్శనాలు. ఎటువంటి సంకోచాలు లేకుండా.. చేరిన క్షణమే, ఆ పార్టీ నాయకులతో బహిరంగంగా, చాలా కాలం తరువాత కలుసుకున్న పాత మిత్రుల్లా వ్యవహరిస్తున్నారు! ప్రజలు ఏమనుకుంటున్నారనేది ఈ ఎమ్మెల్యేలు, ఎంపీలకు పట్టడం లేదు! నిజానికి ఫిరాయింపులు అనేవి కొత్త రాజకీయ పరిణామాలు కానేకావు. భారతదేశ రాజకీయాలలో పార్టీ ఫిరాయింపులకు దశాబ్దాల చరిత్ర ఉన్నది. ఈ నీతిబాహ్య రాజకీయాల పట్ల ఇప్పుడు ప్రజల్లో ఎటువంటి పట్టింపు లేకపోవడమే దిగ్భ్రాంతికరం. ఫిరాయింపులకు పాల్పడినవారు తమను ఎన్నుకున్న ఓటర్లకుగానీ, విశాల ప్రజానీకానికిగానీ తమ నిర్ణయంపై ఎటువంటి వివరణ ఇవ్వడం లేదు. రాజకీయాలు వ్యాపార లావాదేవీల వ్యవహారమయ్యాయి. ఫిరాయింపుదారులకు, వారిని చేర్చుకున్న పార్టీకి మధ్య కుదిరిన ఒప్పందానికి షరతులు ఏమిటో ప్రతి ఒక్కరికీ తెలుసు. రాజ్య వ్యవస్థ ఆర్థిక వనరులు అందుబాటులో ఉండడమనేది కూడా సదరు ఒప్పందంలో భాగంగా ఉంటోంది. ఇటీవల పార్టీ ఫిరాయించిన శివసేన ఎంపీ ఒకరు ఇలా చెప్పారు: 'నా నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు సాధించుకోవాలంటే నేను పార్టీ మారడం తప్పనిసరి'. ఫిరాయింపులను ప్రజల తీర్పును వంచించడంగా ఎవరూ ఇంకెంత మాత్రం భావించడం లేదు. అవి సాధారణ వ్యవహారాలైపోయాయి. అధికార సాధనకు ఫిరాయింపులూ మరొక మార్గమని ప్రజలు అంగీకరిస్తున్నారు! ఫిరాయింపులపై విమర్శలకు బీజేపీ మద్దతుదారులు అదే రీతిలో ప్రతిస్పందిస్తున్నారు: కాంగ్రెస్ విషయమేమిటి? దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో ఫిరాయింపులు జరగలేదా? 'ఆయారామ్, గయారామ్' అనే పరిహాసం ప్రాచుర్యంలోకి వచ్చింది నరేంద్ర మోదీ అధికారంలోకి రావడానికి చాలా కాలం ముందే కాదూ? 'అవును' అనేదే పై ప్రశ్నలన్నిటికీ సమాధానం. ఫిరాయింపులు భారత ప్రజాస్వామ్యమంత పాతవి. కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో ప్రతిపక్షాల ఆధ్వర్యంలో ఉన్న ప్రభుత్వాలను రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా బర్తరఫ్ చేశారు. పదవుల కోసం పార్టీ మారిన శాసనసభ్యులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే రాజకీయ అవకాశవాదం బాగా వర్ధిల్లింది. నాయకులు పార్టీలు మారడంపై విమర్శలు రావడం పరిపాటి. అయితే ఆ విమర్శలకు పాలకపక్షం వారు ప్రతిస్పందిస్తూ 'గతంలో మీరూ అదే చేశారు కదా' అని పాత విషయాలను బయటకు తీసి ఎత్తిపొడవడం కూడా అంతే పరిపాటి. నాయకులు పార్టీలు మారడం అనేది కొత్తేమీ కాదు. ఇప్పుడు అసలు సమస్యేమిటంటే ఆ ఫిరాయింపుల స్వభావం పూర్తిగా మారిపోవడమే. కాంగ్రెస్ హయాంలో ఆధిపత్య పార్టీ వ్యవస్థకు తార్కాణంగా ఫిరాయింపులు ఉండేవి. ఇప్పుడు ఒక సర్వాధిపత్య పార్టీని సృష్టించి సుస్థిరం చేసే వ్యూహంలో భాగంగా ఫిరాయింపులు జరుగుతున్నాయి. నాటి నేటి ఫిరాయింపులలో ఈ వ్యత్యాసం సమకాలీన రాజకీయాల్లో ఒక ముఖ్యమైన మార్పును వివరిస్తుంది. గత దశాబ్దకాలంలో నరేంద్రమోదీ, అమిత్‌షాల నేతృత్వంలోని బీజేపీ ఒక శక్తిమంతమైన ఎన్నికల యంత్రంగా ఆవిర్భవించింది. స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఇదొక అపూర్వమైన విషయమే, సందేహం లేదు. సంస్థాగత బలం, ఆర్థిక వనరులు, కమ్యూనికేషన్ సాధనాలు, నాయకత్వ నిర్మాణం మొదలైన అంశాలలో ఈ బీజేపీకి సమస్థాయి పార్టీ మరేదీ లేదు. ఎన్నికలలో బీజేపీ సాధిస్తున్న అప్రతిహత విజయాలకు ఆ శక్తి సామర్థ్యాలే కారణమని అంగీకరించవలసి ఉన్నది. అయితే ఆ ఘన విజయాలు ఒక కొత్త రాజకీయ తర్కాన్ని కూడా సృష్టించాయి. ఎన్నికల్లో విజయం సాధించడం ఇంకెంత మాత్రం అధికారంలో కొనసాగేందుకు ఒక మార్గం కాదు. దేశవ్యాప్తంగా సమస్త ఎన్నికలలోనూ విజయం సాధించడమే బీజేపీకి లక్ష్యంగా మారింది. ఈ దృక్కోణం నుంచి చూసినప్పుడు ఫిరాయింపులు కేవలం యాదృచ్ఛిక సంఘటనలు కాదు, అవి పార్టీలను స్వాధీనపరచుకునే వ్యూహాలు. ఫిరాయింపులు జరిగిన పద్ధతిని చూడండి.. జ్యోతిరాదిత్య సింధియా, ఆయన విధేయులు కాంగ్రెస్ నుంచి నిష్క్రమించిన తరువాత మధ్యప్రదేశ్‌లో ఆ పార్టీ ప్రభుత్వం పడిపోయింది. మహారాష్ట్రలో శివసేన తొలి చీలికను చవిచూసింది. ఆ తరువాత ఎన్సీపీ చీలిపోయింది. ఈశాన్య రాష్ట్రాలలో ప్రత్యర్థి పార్టీల నాయకులు, శాసనసభ్యులను చేర్చుకోవడం ద్వారా బీజేపీ అక్కడ క్రమంగా విస్తరించింది. ఇప్పుడు పలు ఈశాన్య రాష్ట్రాలలో అధికారంలో ఉన్నది. శాసనసభలలో సంఖ్యా బలాన్ని పెంచుకోవడం కంటే ప్రత్యర్థి పార్టీలను అన్ని విధాలా దెబ్బతీయడమే బీజేపీ అసలు లక్ష్యం. భవిష్యత్తులో తనకు ఏ విధమైన సవాళ్లూ రాకుండా ఉండేందుకు బీజేపీ చాలా పకడ్బందీగా వ్యవహరిస్తోంది. సైద్ధాంతిక నిబద్ధత, కార్యకర్తల విధేయత పరిపూర్ణంగా ఉన్న పార్టీ తమది అని ఒకప్పుడు సగర్వంగా చెప్పుకున్న బీజేపీ, ఇప్పుడు ప్రత్యర్థి పార్టీల నాయకులు, కార్యకర్తలను పెద్ద ఎత్తున చేర్చుకుంటున్నది. భారతీయ జనతా పార్టీ నిజానికి 'భర్తీ జనతా పార్టీ' అని పలువురు వ్యంగ్యంగా విమర్శిస్తున్నారు. ఈ పరిహాసంలో సత్యం ఉన్నది. వాజపేయి నాయకత్వంలో బీజేపీ ఇతర పార్టీలతో పొత్తులు, సామాజిక సంకీర్ణాలు, ఓటర్లను ఆకట్టుకోవడం ద్వారా విస్తరించింది. ప్రజలను ఒప్పించడం ద్వారానే రాజకీయ విస్తరణ సాధ్యమని వాజపేయి విశ్వసించారు. అయితే మోదీ--షాల నేతృత్వంలోని బీజేపీ రాజకీయ విస్తరణకు ఎమ్ అండ్ ఏ (మెర్జర్స్ అండ్ అక్విజిషన్స్) నమూనాను అనుసరిస్తోంది. నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలను పార్టీలో చేర్చుకోవడం, కొన్ని సందర్భాలలో పార్టీలకు పార్టీలనే కలుపుకోవడం ద్వారా విస్తరిస్తోంది. వాజపేయి, మోదీ నమూనాలు రెండిటికీ పార్టీ పెరుగుదలే లక్ష్యం. అయితే అందుకు అనుసరించిన పద్ధతులు మౌలికంగా భిన్నమైనవి. రాజకీయవేత్తలు సాధారణంగా విజయవంతమైన పార్టీల వైపు ఆకర్షితులవుతారని బీజేపీ మద్దతుదారులు వాదిస్తారు. ఈ వాదన నిస్సందేహంగా నిజమే. అయితే ఇది ఒక రాజకీయ శూన్యంలో సంభవించడం లేదు. మోదీ సర్కార్ తమ నాయకులపై దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతుందని, ఆర్థిక ఒత్తిళ్లకు లోనుచేస్తుందని, విధేయతలు మార్చుకున్నవారికి ప్రోత్సాహకాలు కల్పిస్తుందని ప్రతిపక్షాలు తరచూ ఆరోపిస్తున్నాయి. అవినీతి ఆరోపణలు ఉన్న విపక్ష నాయకులు బీజేపీలో చేరితే వారికి ఆ పార్టీ చట్టం నుంచి రక్షణ కల్పిస్తుందనే భావన ప్రజలలో నెలకొనడానికి సహేతుకమైన కారణాలు ఉన్నాయి. ప్రభుత్వ సంస్థల, రాజ్యాంగ వ్యవస్థల నిష్పాక్షికత పైనే కాకుండా ఆ నిష్పాక్షికతపై ప్రజల పరిపూర్ణ నమ్మకంపై కూడా ప్రజాస్వామ్య వ్యవస్థల మనుగడ ఆధారపడి ఉన్నది. అయితే ఇప్పుడు ఆ సంస్థల, వ్యవస్థల నిష్పాక్షికతలో ప్రజల విశ్వాసం హరించుకుపోతోంది. ఫిరాయింపుల వ్యతిరేక చట్టాన్ని చాలా తెలివిగా ఉల్లంఘించడం జరుగుతోంది. ఇటీవల బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు త్రిపురకు చెందిన ఒక అనామక పార్టీలో చేరడమే అందుకొక నిదర్శనం. న్యాయవ్యవస్థ సైతం ఫిరాయింపుల వ్యతిరేక కేసులలో నిర్ణయం తీసుకోవడంలో చేస్తున్న జాప్యం ఆ అక్రమ చర్యలను నిరోధించడానికి దోహదం చేయడం లేదు. పౌరులు ఓటు వేసినప్పుడు ఒక అభ్యర్థిని తమ ప్రతినిధిగా ఎన్నుకోవడమే కాకుండా ఒక రాజకీయ పార్టీని, దాని ప్రణాళికను అంగీకరిస్తున్నారు. పాలనకు దిశా నిర్దేశంగా ఒక రాజకీయ దార్శనికతను ఆమోదిస్తున్నారు. మరి ఎన్నికల అనంతరం గెలిచినవారి ఎత్తుగడలు పౌరుల అభీష్టాన్ని వమ్ము చేస్తున్నాయి. ఇది న్యాయమేనా? రాజకీయ పునరేకీకరణలకు వ్యతిరేకంగా చేస్తున్న వాదన కాదు ఇది. పార్టీల ప్రాధాన్యాలు మారుతుంటాయి. నాయకులు తమ అభిప్రాయాలను తరచూ మార్చుకుంటుంటారు. సైద్ధాంతిక విశ్వాసాలతో కాకుండా అధికార లాలసతో ఫిరాయింపులు మామూలు వ్యవహారమయినప్పుడు ప్రజాస్వామ్యం భావాల సంఘర్షణకు ఆస్కారమివ్వదు; రాజకీయ ఆస్తుల విపణిగా పరిణమిస్తుంది. బెంగాల్, మహారాష్ట్రలో ఫిరాయింపులకు పాల్పడినవారు తమను ఒక రాజకీయ వేలంలో అమ్ముడుపోయినవారుగా ప్రజలు భావిస్తారనే విషయాన్ని ఏ మాత్రం పట్టించుకోలేదు. ప్రజలు తమను ఛీ కొడతారనే భయం ఆ ఫిరాయింపుదారులకు ఏ మాత్రం లేదు. అసలు రాజకీయ సంస్కృతే పార్టీ ఫిరాయింపులకు అనుకూలంగా ఉన్నప్పుడు ప్రజలకు ఎందుకు భయపడాలి? చెప్పవచ్చినదేమిటంటే ఫిరాయింపులకు నైతిక సమర్థింపు, న్యాయ సమ్మతి ఇంకెంత మాత్రం అవసరం లేదు. అధికార సాధనలో సఫలమవడమే ముఖ్యం. ఎలా అందలాలు ఎక్కారన్నది ఎవరూ పట్టించుకోని చాలా అప్రధాన వ్యవహారమే సుమా! స్వాతంత్ర్య శతాబ్దికి వడివడిగా సాగుతున్న నేటి భారతదేశంలో ఫిరాయింపులు అనేవి ఇంకెంతమాత్రం రాజకీయ నాయకులు పార్టీలు మారే సాధారణ వ్యవహారం కాదు. ఫిరాయింపుల అనైతికతతో రాజకీయ సంస్కృతే సమూలంగా మారిపోయింది: రాజకీయాలు సైద్ధాంతిక నిబద్ధత కోల్పోయి వ్యాపార వ్యవహారాలయ్యాయి; ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం కంటే స్వార్థ ప్రయోజనాలకు పార్టీలు మారడం సాధారణమైపోయింది; ప్రజలను ఒప్పించి ఓట్లు, సీట్లు సాధించడం కాకుండా ఇతర పార్టీల తరఫున గెలిచిన వారిని ప్రలోభాలతో వశపరచుకుని చట్టసభలలో సంఖ్యా బలం పెంచుకోవడానికి నాయకులు ప్రాధాన్యమిస్తున్నారు. కార్పొరేట్ సంస్థలు కంపెనీలను స్వాధీనం చేసుకున్న విధంగా రాజకీయ పార్టీలు ధనబలంతో శాసనసభ్యుల మద్దతును కూడగట్టుకోవడం ప్రజాస్వామిక తీర్పును అపహాస్యం చేస్తోంది. నాయకుల, పార్టీల అనైతిక వ్యవహారాల ఫలితంగా ఎన్నికలు రాజకీయ బేరసారాలకు మొదటి వేలంపాట బిడ్)మారిపోయాయి.

# మాదకద్రవ్యాలను సమాజానికి దూరం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత...

-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
-డ్రగ్స్, మత్తు పానీయాలు సేవించడం వ్యాధి కంటే ప్రమాదకరం..
-ప్రజల సహకారంతో గంజాయి రహిత సమాజమే లక్ష్యం..
-పోలీస్ కమిషనర్ సునీల్ దత్
-డ్రగ్స్ బారిన పడినట్లు అనుమానం వస్తే 1908 కు సమాచారం అందించాలి..
-అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, పోలీస్ కమీషనర్

హంసకలం వార్త



తెలంగాణలో ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో మరో అధికారి మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, బాధ్యతగా కృషి చేయాలని, జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అన్నారు. ంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం ఖమ్మం నగరం మమత రోడ్డు లోని వివిసి టాటా సర్వీస్ సెంటర్ నుంచి లాకారం ట్యాంక్ బండ్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ప్రారంభించారు. విద్యార్థులు, యువత, పోలీస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తో కలిసి రన్ లో కలెక్టర్, పోలీస్ కమిషనర్ లు పాల్గొని స్ఫూర్తి నిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, దేశ నిర్మాణంలో యువత పాత్ర చాల కీలకమని, యువతకు ఉపాధి కల్పన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా నిధులు కేటాయిస్తూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయని అన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే తక్షణమే అప్రమత్తం కావాలని అన్నారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా కాపాడుకోవాలని, మాదకద్రవ్యాలు, మత్తు పానీయాలు సేవించడం వ్యాధి కంటే ప్రమాదకరమని వివరించారు. డ్రగ్స్ వాడకం వల్ల ఒకరి జీవితం మాత్రమే ప్రభావితం కాదని, కుటుంబం, సమాజాన్ని నాశనం చేస్తుందని అన్నారు. డ్రగ్స్ నియంత్రణ కేవలం అధికారులు మాత్రమే చేయలేరని, ప్రజలంతా సమిష్టిగా ఉంటూ అధికారులకు సహకరిస్తేనే మెరుగైన ఫలితాలు లభిస్తాయని కలెక్టర్ తెలిపారు. ౧యువత డ్రగ్స్ వంటి వాటి వైపు వెళ్లకుండా దూరంగా ఉండాలని, తమ ఉజ్వల భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, ఆరోగ్యశాఖ, మాదకద్రవ్య నివారణ సంస్థలు, సమాజం అందరూ కలిసి సమష్టిగా చైతన్యం పెంచినప్పుడే మాదకద్రవ్యాల ప్రమాదం నుంచి దూరంగా ఉంచి ఆరోగ్యకరమైన భవిష్యత్తు అందించగలుగుతామన్నారు. పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వాములై భావితరాలకు మంచి భవిష్యత్ అందించాలని అన్నారు. యువత దృష్టి అంతా జీవిత లక్ష్యంపై మాత్రమే ఉండాలని, నిషేధిత గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు విద్యార్థులు ఆకర్షితులు కావద్దని సూచించారు. గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడితే మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పాడు చేస్తుంద ˇన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన, గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా పోలీసుశాఖ కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే విద్యాసంస్థలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తునమన్నారు. ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తుపదార్థాలు విక్రయిస్తున్నట్లు, తాగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1908 కు సమాచారం అందించాలన్నారు. మీ వివరాలు గోప్యం గా ఉంచడం జరుగుతుందని అన్నారు. అనంతరం ప్రజలు, యువత, విద్యార్థులు, అధికారులతో కలిసి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం పై ప్రతిజ్ఞ చేశారు. తర్వాత "ఐయామ్ యాంటీ డ్రగ్ సోల్జర్స్" సెల్ఫ్ పాయింట్ వద్ద ఫోటోలు దిగడంతో పాటు సైన్ బోర్డు వద్ద సంతకాలు చేసి మాదకద్రవ్యాల నిర్మూలనకు తమ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రమణమూర్తి, ఎస్బి ఏసీపీ మహేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు, ఎస్సై లు, అధికారులు, యువత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో మరో అధికారి

-శామీర్ పేట తహశీల్దార్ సుచరిత నివాసంలో భారీగా అక్రమాస్తులు
-ఏసీబీ సోదాల్లో భారీగా అక్రమాస్తులు సోదాల్లో గుర్తించిన ఆస్తులు రూ.5.05 కోట్లు

హంసకలం వార్త





తెలంగాణలో ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో సస్పెండ్ అయిన శామీర్ పేట తహశీల్దార్,జాయింట్ సబ్-రిజిస్ట్రార్ తుమ్మకొమ్మ సుచరిత నివాసంలో ఏసీబీ జరిపిన సోదాల్లో భారీగా అక్రమాస్తులను గుర్తించారు. సోదాల్లో గుర్తించిన మొత్తం ఆస్తులు రూ.5.05 కోట్లు అని, పత్రాల్లో ఉన్న విలువ కంటే ఈ స్థిరాస్తుల మార్కెట్ విలువ గణనీయంగా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏసీబీ చెబుతోంది.

-తెలంగాణలో ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో మరో అధికారి

తెలంగాణలో ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో మరో అధికారి చిక్కారు. ఈసారి ఒక మహిళా అధికారి అక్రమాస్తుల కేసులో వార్తల్లో నిలిచారు. సస్పెండ్ అయిన శామీర్ పేట తహశీల్దార్, జాయింట్ సబ్-రిజిస్ట్రార్ తుమ్మకొమ్మ సుచరిత నివాసంలో ఏసీబీ జరిపిన సోదాల్లో భారీగా అక్రమాస్తులను గుర్తించారు. 2026 మే నెలలో స్థానిక రైతులకు చెందిన 30 ఎకరాలను వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు సుచరిత రూ.30 లక్షలు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో మే 26న తొలివిడత కింద రూ.2 లక్షల సొమ్మును ప్రైవేటు డ్రైవర్ ద్వారా తీసుకుంటుండగా పట్టుబడ్డారు. దీంతో సుచరితను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆమెపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు ఇదే కేసులో మరోసారి విస్తృత తనిఖీలు చేపట్టారు. సోదాలలో సిద్దిపేట జిల్లా దామరకుంట గ్రామంలో 2.17 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లో 3 ఫ్లాట్లు, కీసర మరియు ఖానామెట్ గ్రామాల్లో 2 ప్లాట్లు, రూ.12 లక్షల నగదు, వోక్స్‌వ్యాగన్ కారు, హ్యుందాయ్ క్రెటా కారు, సుమారు రూ.1.20 కోట్ల విలువైన బంగారం ౘ వజ్రాల ఆభరణాలు, బ్యాంకు ఖాతాలో దాదాపు రూ.38 లక్షల నగదు గుర్తించారు.

# ఈ ఏడాది ఖైరతాబాద్ బడా గణేశుడి థీమ్ ఇదే!

-69 అడుగుల పంచముఖ సంకటహర మహాగణపతి
-విగ్రహ నిర్మాణ పనులకు 100 మందిపైగా నిపుణులు
-పంచముఖ సంకటహర మహాగణపతి మట్టి విగ్రహ కర్రపూజ అంకురార్పణ
-ఉత్సవ కమిటీ చైర్మన్ సాయింగారి రాజ్‌కుమార్

హంసకలం వార్త

ఖైరతాబాద్ మహా గణపతి ఈ ఏడాది పంచముఖ సంకటహర మహాగణపతి అవతారంలో స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. గణేశుడి విగ్రహం నమూనా పోస్టర్‌ను ఉత్సవ కమిటీ ఆవిష్కరించింది. గణేషుడికి ఇరువైపుల ఓ వైపు సోమనాథుడి జ్యోతిర్లింగం, మరోవైపు కాళీ మాత విగ్రహాలు ఉంటాయి. 69అడుగుల మట్టి విగ్రహాన్ని తయారుచేసే పనులకు కర్రపూజతో అంకురార్పణ చేశారు.

-ఖైరతాబాద్ గణేశుడి థీమ్ ప్రకటన 69అడుగుల మట్టి విగ్రహం

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన ఖైరతాబాద్ మహా గణపతి ఈ ఏడాది మరో విశిష్ట అవతారంలోభక్తులకు దర్శనమివ్వనున్నారు. 2026 సంవత్సరానికి సంబంధించిన ఖైరతాబాద్ బడా గణేశుడి థీమ్‌ను ఉత్సవకమిటీ అధికారికం గా ప్రకటించింది.

-పంచముఖ సంకటహర మహాగణపతి మట్టి విగ్రహ కర్రపూజ అంకురార్పణ



ఈ ఏడాది 69 అడుగుల ఎత్తుతో మట్టి విగ్రహాన్ని పంచముఖ సంకటహర మహాగణపతి అవతారంలో ఏర్పాటు చేయనున్నారు. విగ్రహ తయారీ పనులకు ఘనంగా కర్రపూజ నిర్వహించి ఉత్సవకమిటీ అంకురార్పణ చేసింది. ఉత్సవ కమిటీ సభ్యులు ఖైరతాబాద్‌లోని పండల్ వద్ద గణేశుడి నమూనా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నమూనా ప్రకారం ప్రధాన గణపతి విగ్రహానికి ఒక వైపు 15 అడుగుల సోమనాథ జ్యోతిర్లింగం, మరో వైపు కాళీమాత విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. విగ్రహ నిర్మాణ పనులకు 100 మందిపైగానిపుణులు ఉత్సవ కమిటీ చైర్మన్ సాయింగారి రాజ్‌కుమార్ ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ చైర్మన్ సాయింగారి రాజ్‌కుమార్ మాట్లాడుతూ దశాబ్దాలుగా వస్తున్న సంప్రదాయం ప్రకారం కర్రపూజతో విగ్రహ నిర్మాణ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు మొదలు పెట్టినట్లు చెప్పారు. విగ్రహ తయారీ బాధ్యతలను ప్రముఖ శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ పర్యవేక్షిస్తున్నారు ఆయన గత నాలుగు దశాబ్దాలుగా ఖైరతాబాద్ బడా గణేశుడి నిర్మాణంతో అనుబంధం కలిగి ఉన్నారు. ఈ భారీ విగ్రహం నిర్మాణంలో 100 మందికి పైగా నైపుణ్యం కలిగిన కార్మికులు పాల్గొననున్నారు. విగ్రహ నిర్మాణానికి అవసరమైన మట్టి, ఉక్కు, ఎండుగడ్డి, బియ్యం ఊక, స్కాఫోల్డింగ్ కోసం కలప వంటి సామగ్రిని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, తమిళనాడు రాష్ట్రాల నుంచి సేకరిం చినట్లు నిర్వాహకులు తెలిపారు. పర్యావరణ హితంగా మట్టి విగ్రహాన్ని తయారు చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఈ ఏడాది వినాయక చవితి వేడుకలు సెప్టెంబర్ 14న ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు మూడు రోజుల ముందే విగ్రహ నిర్మాణ పనులు పూర్తి చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు శిల్పి రాజేంద్రన్ తెలిపారు. ఖైరతాబాద్ బడా గణేశుడి దర్శనం కోసం ప్రతి సంవత్సరం తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఈ ఏడాదితో ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలు 72 ఏళ్లు పూర్తి చేసుకుంటుండటం మరింత ప్రత్యేకత సంతరించుకుంది.

## సోదర భావానికి ప్రతీక మొహర్రం హర్రం

-మొహర్రం వేడుకల్లో పాల్గొన్న మంత్రి అడ్లూరి

హంసకలం వార్త



మొహర్రం సందర్భంగా రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం ధర్మపురిలో మొహర్రం వేడుకలు పాల్గొన్నారు. ఈసందర్భంగా పట్టణంలోని నంది చౌరస్తాలో పీరీలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో అనేక సంవత్సరాలుగా హిందూ, ముస్లింలు సోదరభావంతో కలిసి పీర్ల పండుగ జరుపుకుంటారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో భవిష్యత్తు తరాల కోరకు ఇదే సంస్కృతిని కొనసాగించాలని మంత్రి కోరారు.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
-జూన్ 28న పోలియో బూత్ డే 0-5 ఏళ్ల చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలి

హంసకలం వార్త



పెద్దపల్లి జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి, కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న 'బూత్ డే' నిర్వహిస్తున్నట్లు, ఆ తర్వాత 29, 30 తేదీలలో ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు జిల్లా వ్యాప్తంగా 62,902 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, పోలియో చుక్కల పంపిణీ కోసం జిల్లాలో 381 బూత్‌లు, 25 మొబైల్ టీమ్స్, 24 ట్రాన్సిట్ పాయింట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని ప్రతి కుటుంబాన్ని సందర్శించి చిన్న పిల్లల వివరాలను సేకరించాలని, ?ముఖ్యంగా వలస కూలీలు, ఇటుక బట్టీలు, నిర్మాణ రంగంలో పనిచేసే వారి పిల్లలు ఈ కార్యక్రమానికి దూరంగా ఉండే అవకాశం ఉన్నందున, వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్ల వంటి రద్దీ ప్రదేశాలలో ట్రాన్సిట్ పాయింట్ల ద్వారా ప్రయాణికులకు కూడా సేవలందించాలని, ?ఈ ప్రక్రియలో వైద్య ఆరోగ్య శాఖతో పాటు విద్యా, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారుల సమన్వయం తప్పనిసరి అని, ఏ ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించుకోకుండా మిగిలిపోకూడదని,అధికారులు తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పేర్కొన్నారు.

## మత్తును చిత్తు చేయండి యువతకు "మాచన" పిలుపు

హంసకలం వార్త



గంజాయి,డ్రగ్స్..ఇలా వివిధ రూపాల్లో లభించే మత్తు పదార్గాలకు అలవాటు కాకుండా యువత తమ బలహీనతను చిత్తు చేయాలని టుబాకో కంట్రోల్ హీరో అవార్డు గ్రహీత,పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్ మెంట్ డిప్యూటీ తాహశీల్దార్ మాచన రఘునందన్ పిలుపునిచ్చారు. డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మాచన రఘునందన్ ధర్మఘంట ప్రతినిధితో మాట్లాడుతూ ..గాంజా చాక్లేట్లను విద్యార్థులకు విక్రయించే ముఠాను పోలీసులు పట్టుకున్న ఉదంతం దరిమిలా..మానవీయ కోణంలో స్పందించారు.గాంజా..మాత్రమే గాక మాదక ద్రవ్యాల నుంచి కూడా రాష్ట్రాన్ని విముక్తి చేయాలని సాక్షాత్తు ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో ఉన్నారని,ఇది ఓ రకంగా యువతను ఓ గొప్ప "ఆయుధం"గా..తమను తాము మలచుకునేలా చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులు,యువత మత్తుకు లోనైను నిర్వీర్యం కావటం అవాంఛనీయమన్నారు.ముఖ్యంగా కార్పొరేట్ పాఠాశాలల్లో చదివే విద్యార్థులకు అవసరానికి మించి పాకెట్ మనిని వారి తల్లిదండ్రులు ఇవ్వటం కూడా పిల్లలు చెడు అలవాట్లకు దగ్గర కావడం కోసం దోహదపడేలా ఉంటుందన్నారు. టీనేజర్స్ సాధారణంగా మత్తుకు బానిస అవుతుంటారని, అందుకే యుక్త వయస్సులో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు కనీసం రోజు లేదా అడపాదడపా తమ పిల్లలతో వారి చదువు తీరుతెన్నులపై కాసేపు దృష్టి సారించినా పరిస్థితి చేయిదాటదన్నారు.పిల్లలకు గారంతో డబ్బు అడిగినంత ఇవ్వడం,అవసరం ఉన్నా లేకున్నా పాకెట్ మని ఉండటంతో నే జల్సా వైపు విద్యార్థులు,యువత ఆకర్షితమవుతొందన్నారు.విద్యార్థుల తల్లిదండ్రులు ఎంత బిజీగా ఉన్నా లేకపోయినా..వీలు కలుగజేసుకుని పాఠాశాల, కళాశాలల ప్రాంతాల్లో నిఘా పెడితే ఇలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా చేయొచ్చన్నారు."పోలీసులు ఏమ్ చేస్తున్నారు? ప్రభుత్వం ఏమ్ చేస్తోంది?" అని ప్రశ్నించే కంటే.. తాము ఎంత వరకు పిల్లల నడత అలవాట్లు వారి దోస్తానాపై నిశిత దృష్టి పెడితే?!"అమ్మో..మా పేరెంట్స్ చాటుగా అన్ని గమనిస్తున్నారు" అన్న భయం పిల్లల మదిలో ఉంటుందన్నారు.యుక్త వయసులో ఉన్న విద్యార్థులను కర్కశంగా.. కటువుగా మందలించే బదులు.. వారితో కాసేపు కూచోని చదువుపై చర్చించడమే గాక స్నేహితంగా మాట్లాడితే..ఎన్నో విషయాలు తెలుసుకునే అవకాశం ఉందన్నారు. అంతేగాక అమ్మా నాన్నలు అన్ని తెలుసుకుంటారు,మనం జాగ్రత్తగా ఉండాలన్న విషయంలో భయం భక్తి వాటంతట అవే మదిలో పాతుకు పోతాయని సూచించారు.అంతేగాక దోస్తుల ప్రభావంతో,వారి ప్రోద్బలం వల్ల కలిగే ధూమపానం,గుట్కా వంటి దుర లవాట్లను నియంత్రించవచ్చని పేర్కొన్నారు.

హంస కలం వార్త



## మంచిర్యాలను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

**-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

హంసకలం వార్త



మంచిర్యాలను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని డి.సి.పి.ఎ.భాస్కర్, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్, గుడిపేట 13వ పటాలం కమాండెంట్ లతో కలిసి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుండి ఐ.బి. చౌరస్తా వరకు చేపట్టిన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మాదకద్రవ్యాల వినియోగం సమాజానికి, యువత భవిష్యత్తుకు ప్రమాదకరమని, అందరం సమిష్టిగా కృషి చేసి మంచిర్యాలను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని అన్నారు.ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుని, మాదకద్రవ్యాలకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. మాదకద్రవ్యాల ఉత్పత్తి, రవాణా,విక్రయం, వినియోగాన్ని నిరోధించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డ్రగ్స్ రిహాబిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని,బాధితులకు సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు.చట్ట విరుద్ధంగా మద్యం, గంజాయి,సిగరెట్లను విక్రయించే లైసెన్స్ లేని దుకాణాలను సీజ్ చేయాలని తెలిపారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో అధికార యంత్రాంగం సమిష్టిగా పని చేయాలని తెలిపారు.డి.సి.పి. మాట్లాడుతూ... మాదకద్రవ్యాల తరలింపు పై ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేసి నిరోధించడం జరుగుతుందని,ఎక్కడైనా మత్తుపదార్థాల నిల్వ ఉన్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100లో సమాచారం అందించి తగ్గుముఖం పట్టేలా సమన్వయంతో పని చేయాలని తెలిపారు.ఈ సందర్భంగా మాదకద్రవ్యాల నియంత్రణపై అందరిచే ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,యువత, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో జీవీఆర్ కరాటే అకాడమీ

హంసకలం వార్త



అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సరికొత్త రికార్డు నమోదైంది.జీవీఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్.గోపాల్ రెడ్డి తన అసాధారణ కరాటే నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ,ఆరుగురు విద్యార్థుల తలలపై ఉంచిన 26 యాపిల్స్‌ను కేవలం 36 సెకన్లలో హ్యాండ్ చాప్స్‌తో బ్రేక్ చేసి రికార్డు సృష్టించారు.ఈ రికార్డులో భార్గవసాయి ప్రణీత్,నైతిక్ రెడ్డి, సంజన,తన్వి,చిన్మయి ప్రియ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఇండియా చీఫ్ కో-ఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్,డాక్టర్ గోపాల్ రెడ్డితో కలిసి ప్రదర్శన్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు,మెడల్స్ అందజేసి అభినందించారు. సమాజానికి చైతన్యాన్ని కలిగించే సందేశంతో నిర్వహించిన ఈ రికార్డు పోటీ అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.రికార్డులు కేవలం ప్రతిభను చాటడానికే కాకుండా సమాజానికి ఉపయోగపడే సందేశాన్ని అందించాలని,ఆ దిశగా డాక్టర్ గోపాల్ రెడ్డి ఎన్నో సంవత్సరాలుగా కృషి చేస్తున్నారని కొనియాడారు.ఈ కార్యక్రమానికి మాజీ హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్,మాజీ కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్,వివేక్ హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎ.కృష్ణారెడ్డి, నేతాజీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వ్యవస్థాపకులు కోట్ల నిరంజన్ రెడ్డి, అకాడమీ బ్లాక్ బెల్టర్స్ కరీమ్, అమృత రెడ్డి,గణ సంతోషిణి రెడ్డి, రాజు, సుధాకర్, అనఘ, షైనీ,ద్వైత తో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు, క్రీడాభి మానులు పాల్గొని రికార్డు గ్రహీతలను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి క్రీడలు,క్రమశిక్షణ,ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని జీవీఆర్ కరాటే అకాడమీ పిలుపునిచ్చింది.

## వార్నీఅక్కడెలాప్రయాణికుల ప్రవర్తనపై అనుమానం!

**-ప్యాంట్ల నడుము భాగంలో కుట్టిన పాకెట్‌లో పేస్ట్ రూపంలో ఉన్న బంగారం**

**-అక్రమంగా బంగారాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు పట్టుబడిన ఘటన**

**-పట్టుబడిన బంగారం విలువ మార్కెట్‌లో రూ.3కోట్లకు పైగా!**

హంసకలం వార్త




హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మరోసారి భారీ మొత్తంలో బంగారం పట్టుపడింది. కౌలాలంపూర్ నుండి వచ్చిన ఇద్దరు ప్రయాణికుల నుండి రూ. 3.36 కోట్ల విలువైన 2.271 కిలోల 24-క్యారెట్ల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్ట్ చేసి పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. అక్రమంగా బంగారాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు పట్టుబడిన ఘటన హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే ఈ నెల 24వ తేదీన కౌలాలంపూర్ నుంచి ఇద్దరు ప్రయాణికులు హైదరాబాద్ లోని శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. అయతే ఫ్లైట్ దిగిన తర్వాత ఎయిర్‌పోర్టు చెకింగ్ పాయింట్ వద్దకు వచ్చిన వారి ప్రవర్తనపై అనుమానం రావడంతో వారిని ఎయిర్ పోర్టు సిబ్బంది అడ్డుకున్నారు. ప్యాంట్ల నడుము భాగంలో కుట్టిన పాకెట్‌లో పేస్ట్ రూపంలో ఉన్న బంగారం వారిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా వారి ప్యాంట్ల నడుము భాగంలో ప్రత్యేకంగా కుట్టిన పాకెట్‌లో పేస్ట్ రూపంలో ఉన్న బంగారం కనిపించింది. దాన్ని బయటకు తీయగా మొత్తం 2.271 కిలోల 24-క్యారెట్ల స్వచ్ఛమైన బంగారాన్ని ఎలాంటి ధృవీకరణ పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. దీంతో దాన్ని స్వాధీనం చేసుకొని ఇద్దరు ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన బంగారం విలువ మార్కెట్‌లో రూ.3కోట్లకు పైగా! పట్టుబడిన బంగారం విలువ మార్కెట్‌లో రూ.3కోట్లకు పైగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. దీంతో వారిపై పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసుకున్న కస్టమ్స్ అధికారులు ఇద్దరిని అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# డ్రగ్స్ రహిత సమాజం అందరి బాధ్యత

హంసకలం వార్త

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలనీ నిజామాబాద్ పోలీస్ కమీషనర్ సాయి చైతన్య వెల్లడించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు ల ఆధ్వర్యంలో 2 కే రన్ కార్యక్రమం నిర్వహించారు. సే నో టు డ్రగ్స్ సే ఇస్ టు లైఫ్ అని పిలుపునిచ్చారు. వివిధ పాఠశాలల నుండి 3000 మంది విద్యార్థినీ విద్యార్థులు , ప్రజలు ఈ రన్ లో పాల్గొన్నారు. డగ్స్ నిర్మూలనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని , యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటం అందరి బాధ్యత అని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య, అన్నారు.నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ మరియు ఐఎంఏ డాక్టర్స్ సహకారంతో డ్రగ్స్ నియంత్రణ అవగాహన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 2కే రన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యులు , ఐఎంఏ ప్రతినిధులు , కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పోలీసు అధికారులు , సభ్యులకు అభినందనలు తెలిపారు. చిన్న చిన్న మంచి అలవాట్లతోనే సమాజంలో పెద్ద మార్పు తీసుకురావచ్చని అన్నారు. డ్రగ్స్ సమస్య కొత్తది కాదని , దేశాన్ని బలహీనపర్చేందుకు శత్రు దేశాలు యువతను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ వ్యాప్తిని ప్రోత్సహిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశ బలం యువతేనని , వారిని మత్తు పదార్థాలకు బానిసలుగా మార్చే కుట్రలను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 1908 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా పోలీసు లకు సమాచారం అందించాలని , సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబ డతామని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణ కోసం కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా నిధులు వెచ్చిస్తు న్నాయని , ఈ సమస్య లేకుంటే ఆ నిధులను విద్య వంటి అభివృద్ధి రంగాలకు వినియోగించే అవకాశం ఉండేదని చెప్పారు. రానున్న రెండు నుంచి మూడు నెలల పాటు జిల్లాలోని అన్ని పాఠశాలలు , ఇంటర్మీడియట్ కళాశాలలు , ప్రొఫెషనల్ కళాశాలల్లో విస్తృత స్థాయిలో డ్రగ్స్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ “సే నో టూ డ్రగ్స్ -- సే ఎస్ టూ లైఫ్‌లి అనే సందేశాన్ని సమాజంలోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకుని కృషి చేయాలని పోలీస్ కమీషనర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ కవిత రెడ్డి మాట్లాడుతూ , రాష్ట్ర ముఖ్యమంత్రి డ్రగ్స్ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. పోలీస్ శాఖలో ఈగల్ బృందం డ్రగ్స్ నియంత్రణ కోసం నిరంతరం పనిచేస్తోందని చెప్పారు. అనంతరం సంతోష్ కుమార్ విద్యార్థులు, యువతతో కలిసి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణ ప్రతిజ్ఞ చేయించారు.డ్రగ్స్ నియంత్రణ కోసము పోలీస్ కళాబృందం చేసిన నాటిక విద్యార్థులను ఎంతో ఆకట్టుకున్నది.2కె రన్ కార్యక్రమము పోలీస్ కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు . ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల




నుండి ప్రారంభమై - రైల్వే కమాన్ - పోలీస్ పరేడ్ గ్రౌండ్ - ఎన్టీఆర్ చౌరస్తా - ఆర్ అండ్ బి ఆఫీస్ - రైల్వే స్టేషన్ - జిల్లా ఫైర్ స్టేషన్ - పాత కలెక్టరేట్ గ్రౌండ్ వరకు జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్ , జిల్లా ఇన్కమ్ టాక్స్ ఆఫీసర్ ఐశ్వర్య , ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ విశాల్ , నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ మెంబర్లు దర్శన్ సింగ్ , శిరీష్ కుమార్ , హితేన్ బిమాని , రజనీకాంత్ , శ్రీనివాస్ రెడ్డి , డి వై ఎస్ ఓ పవన్ కుమార్ , ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ , సీఐలు , ఎస్. ఐ లు పోలీసు సిబ్బంది , పోలీస్ కళాబృందం , నవ్య భారతి గ్లోబల్ పాఠశాల విద్యార్థులు , మెడికల్ కాలేజ్ విద్యార్థులు , ఎన్సిసి క్యాండిడేట్స్ వివిధ కళాశాల పాఠశాలల విద్యార్థులు , ప్రతినిధులు , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# భర్త వృషణాలను గట్టిగా పిసికి చంపిన భార్య

**-కేసును చేదించిన నాగర్ కర్నూల్ డివిజన్ పోలీసులు**

**-వివరాలు వెల్లడించిన డిఎస్పీ బుర్రి శ్రీనివాస్ యాదవ్**

హంసకలం వార్త



నాగర్ కర్నూల్ డిఎస్పి శ్రీనివాస్ యాదవ్ తన డివిజన్ పరిధిలో జిల్లా ఎస్పీ ఆదేశాలతో పోలీస్ లు కేసు ఏదైనా వెంటనే కేసుకు ముగింపు పలుకుతున్నారు. నిందితులు కటకటాల పాలవుతున్నారు. ఈ విధంగానే ఇప్పుడు మరో కేసును చేదించారు. జిల్లా తిమ్మాజీపేట మండలం అవంచ గ్రామంలో ఈ నెల 23 న ఓ వ్యక్తి హత్యకు గురైన కేసును పోలీసులు చేదించారు. శుక్రవారం నాగర్ కర్నూల్ డీఎస్పీ బుర్రి శ్రీనివాసులు మీడియా సమావేశంలో తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అవంచ గ్రామానికి అమ్మపల్లి యాదయ్య(50) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కూతురిని మిడ్జిల్ మండలం బోయినపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులుకు ఇచ్చి వివాహం చేశారు. తనకు ఉన్న ఏకర నర (1.5) పొలం తన అల్లుడికి చేయ్యాలి అని తన భార్య అలివేల గత రెండు సంవత్సరాల నుండి ఒత్తిడి చేస్తుంది. అందుకు మృతుడు నిరాకరించాడు. తన భార్యకు అల్లుడితో అక్రమ సంబంధం ఉంది అని తన భార్యతో తరచూ గొడవ పడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో యాదయ్య (50) ను చంపితేనే భూమి అల్లుని పేరా చేయొచ్చు. రైతు భీమా డబ్బులు వస్తాయి అని, ఎలాగైనా చంపాలని భార్య అలివేల కూతురు పద్మ, అల్లుడు ఆంజనేయులు కలిసి పథకం రచించుకున్నారు.

**-వృషణాలను గట్టిగా పిసికి**

ఈ నెల 23న తన భర్తతో గొడవ పెట్టుకుని కూతురుని అల్లుడ్ని ఇంటికి పిలిచింది. ముగ్గురు కలిసి యాదయ్యతో గొడవ పడ్డారు. అల్లుడు మామ గొంతుపట్టి గోడకేసి కొట్టాడు. కిందపడగానే కూతురు రెండు కాళ్లు పట్టుకుంది. భార్య అక్కడే ఉన్న ఒక రాడ్డు తీసుకొని ఛాతిపై కొట్టి తన వృషణాలను గట్టిగా పిసికింది. మృతుడు అక్కడికక్కడే మరణించాడు. కూతురు అల్లుడు తిరిగి వారి ఊరికి వెళ్ళిపోయారు. మరుసటి రోజు తన భార్య ఏమీ తెలియనట్టు అనారోగ్యంతో మరణించాడని నమ్మించి అంత్యక్రియలు చేయబోయింది. ఈ క్రమంలో బంధువులు ఛాతిపై ఉన్న గాయాలు చూసి అనుమానం కలిగింది. వారి బంధువైన గడ్డమీది పరశురాములు మృతుని భార్యపై తిమ్మాజీపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వారి స్టైల్లో మృతుని భార్యను విచారించగా, తాను తన కూతురు అల్లుడు కలిసి హత్య చేశామని అంగీకరించింది. గురువారం ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఈ సమావేశంలో నాగర్ కర్నూల్ సీఐ అశోక్ రెడ్డి, తిమ్మాజీపేట ఎస్సై శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఈనెల 28,29 న జరిగే రైతు మేళాను రైతులు వినియోగించుకోవాలి..

**-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్..**

**-150 స్టాళ్లతో అధునిక వ్యవసాయ పద్దతుల పై అవగాహన ప్రదర్శనలు..**

**-జూన్ 30న నిర్వహించే రైతు ఆశీర్వాద సభకు పకడ్బందీగా ఏర్పాట్లు..**

**-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన కు కట్టుదిట్టమైన భద్రత..**

**-చింతకాని మండలం జగన్నాథపురం వద్ద స్టాల్స్, స్టేజి, భోజనం వసతులు, పార్కింగ్ ఏర్పాట్ల పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్..**

హంసకలం వార్త

ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలం జగన్నాథపురం వద్ద ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రైతు మేళా, ముఖ్యమంత్రి రైతు ఆశీర్వాద సభ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమ ప్రాంగణంలోని స్టాళ్లు, ప్రధాన వేదిక, భోజనశాలలు, పార్కింగ్ స్థలాలు, ప్రజల రాకపోకల మార్గాలు, పారిశుధ్య ఏర్పాట్లు, తాగునీటి వసతులు తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, జూన్ 28, 29, 30 తేదీల్లో నిర్వహించే రైతు మేళాలో 150కు పైగా స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశు సంవర్ధక, మత్స్య, పాల ఉత్పత్తి, సేంద్రీయ వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ, ఆధునిక సాగు పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వంటి విభిన్న రంగాలకు సంబంధించిన ప్రదర్శనలు రైతులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల రైతులు సద్వినియోగం చేసుకొని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. రైతులకు ప్రత్యక్ష అనుభవం కలిగేలా ఆధునిక వ్యవసాయ యంత్రాల ప్రదర్శనలు, అధిక దిగుబడులు అందించే సాగు పద్ధతులపై ప్రత్యేక డెమోలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులతో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి రైతుల సందేహాలకు ప్రత్యక్షంగా సమాధానాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు మేళాకు వచ్చే ప్రతి రైతుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా



తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, భోజన వసతులు, సమాచార కేంద్రాలు, తగిన సంఖ్యలో కౌంటర్లు, విశాలమైన పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. మహిళా రైతులు, వృద్ధులకు సౌకర్యాలను ప్రత్యేకంగా దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలని సూచించారు. జూన్ 30న నిర్వహించే ముఖ్యమంత్రి రైతు ఆశీర్వాద సభకు భారీ సంఖ్యలో రైతులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి ఏర్పాట్లను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ, పశుసంవర్ధక, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య, మిషన్ భగీరథ, ఇంజినీరింగ్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నలుగురి హత్య కేసును ఛేదించిన పోలీసులు

-నల్గొండలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దారుణ హత్యలు
-వ్యక్తిగత కక్షలు,డబ్బు,బంగారం కోసమే హత్యలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడి
-నలుగురు నిందితుల అరెస్ట్ రిమాండ్ కు తరలింపు
-నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

హంసకలం వార్త




జిల్లా కేంద్రంలోని తెలంగాణ కాలనీ, సాగర్ రోడ్డులో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు సభ్యులు దారుణ హత్యకు గురైన సంచలన కేసును పోలీసులు కేవలం మూడు రోజుల్లోనే ఛేదించారు.ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు.

-హత్య కేసు ఎలా వెలుగులోకి వచ్చింది?

ఈ నెల 22వ తేదీ సాయంత్రం తెలంగాణ కాలనీలోని ఓ ఇంటి నుంచి తీవ్ర దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇంట్లో నలుగురు మృతదేహాలు కుళ్లిపోయిన స్థితిలో గుర్తించారు. అనంతరం క్లూస్ టీం,ఫోరెన్సిక్ నిపుణులతో కలిసి ఆధారాలు సేకరించి దర్యాప్తు ప్రారంభించారు. ఆత్మహత్యా? లేక హత్యా? అనే కోణంలో విచారణ చేపట్టేందుకు డీఎస్పీ కె.శివరాం రెడ్డి ఆధ్వర్యంలో సీఐలు,ఎస్ఐలు,సీసీఎస్ సిబ్బందితో కలిపి ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీటీవీ ఫుటేజ్,సాంకేతిక ఆధారాలు,స్థానికుల సమాచారంతో దర్యాప్తు జరిపి నార్కట్‌పల్లి ఫ్లైఓవర్ వద్ద నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు నేరాన్ని అంగీకరించారు. నిందితులు వీరే-హత్యలకు దారితీసిన కారణాలు

-సయ్యద్ అస్లాం (28) టాక్సీ డ్రైవర్,గండిపేట,హైదరాబాద్,

తబస్సుం (28)అస్లాం భార్య. మహమ్మద్ సోహైల్ (26) ఆటో డ్రైవర్,కార్ మెకానిక్.హేమంత్ కుమార్ (28) జ్యువెలరీ వ్యాపారి, దిల్‌సుఖ్‌నగర్,హైదరాబాద్.ప్రధాన నిందితుడు అస్లాం ఆర్థిక ఇబ్బందులతో అప్పుల పాలయ్యాడు. మృతురాలు హసీనా వద్ద గతంలో అప్పు తీసుకుని, మరోసారి డబ్బు అడగగా ఆమె నిరాకరిం చడంతో పాటు పాత బాకీ చెల్లించాలని ఒత్తిడి చేయడంతో కక్ష పెంచుకున్నాడు.హసీనా ఇంట్లో నగదు,బంగారం,ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయని తెలిసి,భార్య తబస్సుం ప్రోత్సాహంతో దోపిడీకి పథకం రచించాడు.మృతురాలి కుమార్తె బుష్రా ద్వారా ఇంట్లో డబ్బు, బంగారం ఉన్న విషయాలు తెలుసుకున్నాడు.అలాగే హసీనా కారణంగా గతంలో తమ కుటుంబానికి జరిగిన సంఘటనలపై కూడా కక్ష పెంచుకున్నట్లు విచారణలో వెల్లడైంది.

-ముందే పక్కా ప్రణాళిక

హత్యకు ముందు అస్లాం యూట్యూబ్‌లో “హత్య చేసి ఎలా తప్పించుకోవాలి?”, “శవాలు ఎన్ని రోజులకు కుళ్లిపోతాయి?” వంటి వీడియోలు చూసి పక్కా ప్రణాళిక రూపొందించాడు.ఈ నెల 19న రాత్రి నల్గొండకు వచ్చి ఇంటి వద్ద వేచి ఉండి,తెల్లవారుజామున ఇంట్లోకి ప్రవేశించి దాడి చేశాడు.ముందుగా హసీనాపై కత్తితో దాడి చేసి హత్య చేశాడు.ఆమె కేకలు విని బయటకు వచ్చిన భర్త సుల్తాన్‌ను కూడా హత్య చేశాడు. అనంతరం అడ్డొచ్చిన ముజమ్మిల్‌ను కత్తితో హతమార్చాడు. మంచం కింద దాక్కున్న 12 ఏళ్ల బాలిక అఫ్రూరాను కూడా సాక్ష్యం మిగలకుండా హత్య చేశాడు. నలుగురు మృతి చెందినట్లు నిర్ధారించుకున్న తర్వాత ఇంట్లోని బంగారం,నగదు,భూమి,బ్యాంకు పత్రాలు తీసుకుని మృతదేహాలపై చద్దర్లు కప్పి ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లిపోయాడు.

-బంగారం తాకట్టు..డబ్బు తీసుకున్న నిందితులు

హత్య అనంతరం దొంగిలించిన బంగారు ఆభరణాలను స్నేహితుడు సోహైల్ సహాయంతో దిల్‌సుఖ్‌నగర్ లోని శ్రీ బాలాజీ జ్యువెలర్స్ యజమాని హేమంత్ కుమార్ వద్ద తాకట్టు పెట్టి రూ.5.30 లక్షలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

-స్వాధీనం చేసుకున్న వస్తువులు

రూ.3 లక్షల నగదు,ఐదు తులాల కరిగించిన బంగారు ముద్ద, మహీంద్రా మరాజో కారు,హత్యకు ఉపయోగించిన కత్తి,మూడు సెల్‌ఫోన్లు,రక్తపు మరకలు ఉన్న దుస్తులు,భూమి,బ్యాంకు పత్రాలు,


-పోలీసు బృందానికి ఎస్పీ అభినందనలు

ఈ సంచలన కేసును అత్యంత వేగంగా ఛేదించిన డీఎస్పీ కె.శివరాం రెడ్డి,వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ సీఐ రాఘవరావు,సీసీఎస్ సీఐ చంద్రశేఖర్ రెడ్డి,ఎస్ఐలు, సీసీఎస్ బృందం సభ్యులను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు ప్రకటించారు.

# నిజామాబాద్ ఎక్సైజ్ శాఖలో ‘మామూళ్ల డైరీ’ కలకలం

-అధికారికి చెందినదిగా ప్రచారం
-నెలవారీ వసూళ్ల లెక్కలు వైరల్
-అక్రమాస్తుల కేసు తర్వాత మరోసారి ఎక్సైజ్ శాఖపై అవినీతి ఆరోపణలు

హంసకలం వార్త




నిజామాబాద్ ఎక్సైజ్ శాఖలో మరోసారి అవినీతి ఆరోపణలు కలకలం రేపుతున్నాయి.ఓ ఎక్సైజ్ అధికారికి చెందినదిగా ప్రచారం జరుగుతున్న డైరీ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.ఈ డైరీలో కల్లు డిపోలు,వైన్ షాపుల నుంచి నెలవారీగా వసూలు చేస్తున్నట్లు పేర్కొన్న నగదు వివరాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది.వైరల్ అవుతున్న డైరీ ప్రకారం..కల్లు డిపోలు,వైన్ షాపుల నుంచి ప్రతి నెలా రూ.2 లక్షల వరకు మామూళ్లు వసూలు చేసినట్లు లెక్కలు నమోదు చేసినట్టు సమాచారం.ఏయే ప్రాంతాల నుంచి ఎంత మొత్తం వచ్చిందనే వివరాలు కూడా డైరీలో ఉన్నాయని ప్రచారం జరుగుతుండటంతో ఈ వ్యవహారం సంచలనంగా మారింది.ఇటీవల అక్రమాస్తుల కేసులో నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి చిక్కిన ఘటన మరవకముందే, ఇప్పుడు మరో ఎక్సైజ్ సీఐకి సంబంధించినదిగా ప్రచారం జరుగుతున్న ఈ డైరీ బయటపడటం శాఖలో తీవ్ర కలకలం రేపుతోంది.ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. అయితే వైరల్ అవుతున్న డైరీ నిజంగా సంబంధిత అధికారిదేనా? అందులో ఉన్న వివరాలు ప్రామాణికమైనవేనా? అనే విషయాలపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు.ఈ నేపథ్యంలో సమగ్ర విచారణ జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. డైరీ వ్యవహారం వెలుగులోకి రావడంతో నిజామాబాద్ ఎక్సైజ్ శాఖలో అంతర్గతంగా తీవ్ర చర్చ సాగుతుండగా,దీనిపై ప్రభుత్వం లేదా దర్యాప్తు సంస్థలు ఎలాంటి చర్యలు తీసుకుంటాయన్నది ఆసక్తికరంగా మారింది.

# గిరిజనుల అభ్యున్నతికి పునాది వేసింది ఇందిరా గాంధీ

-దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

హంసకలం వార్త



గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న గిరిజన రిజర్వేషన్ల స్వర్ణోత్సవ బస్సు యాత్రలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొని ప్రసంగించారు.గిరిజనుల సామాజిక,ఆర్థిక,రాజకీయ అభివృద్ధికి బలమైన పునాది వేసిన నాయకురాలు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ అని కొనియాడారు. గిరిజనులు విద్య ,ఉద్యోగాలు, ప్రజాప్రతినిధ్య రంగాల్లో ముందుకు రావడానికి కాంగ్రెస్ పార్టీ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాల్లో రిజర్వేషన్లు ఒక మైలురాయిగా నిలిచాయని అన్నారు.గిరిజన సమాజానికి న్యాయం చేయా లనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు రాజ్యాంగబద్ధమైన హక్కులను అందించిందని,ఆ నిర్ణయ ఫలితంగానే నేడు వేలాది మంది గిరిజన యువత ఉన్నత స్థానాల్లో ఎదుగుతున్నారని పేర్కొన్నారు. గిరిజనుల హక్కులు,సంక్షేమం మరియు అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. గిరిజనులను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంలో ఇందిరా గాంధీ పాత్ర చిరస్మరణీయమని,అందుకే గిరిజన సమాజం ఆమెను ప్రేమతో “గిరిజనుల తల్లి”గా గుర్తుంచుకుంటోందని ఎమ్మెల్యే అన్నారు.గతంలో కాంగ్రెస్ పార్టీ గిరిజనుల కోసం తీసుకున్న సంక్షేమ నిర్ణయాల మాదిరిగానే ప్రస్తుతం కూడా గిరిజనుల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఈ బస్సు యాత్ర ద్వారా గిరిజన రిజర్వేషన్ల చరిత్రను,కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలను ప్రజలకు వివరించడం జరుగుతోందని, గిరిజనుల సాధికారత కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం నిరంతరం కొనసాగుతుందని పేర్కొన్నారు.

## కల్లూరుగూడెం పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు పరిశీలించిన మంత్రి తుమ్మల ..

-ఆగస్టు నాటికి ఫ్యాక్టరీ ఆరంభమయ్యే విధంగా పనులు వేగవంతం చెయ్యాలని మంత్రి ఆదేశాలు ..
-పామాయిల్ సాగు తెలంగాణ రైతాంగానికి వరం మంత్రి తుమ్మల



హంసకలం వార్త

పామాయిల్ సాగు తెలంగాణ రైతాంగానికి వరంగా మారిందని దేశానికే ఆయిల్ ఫామ్ హబ్ గా తెలంగాణ రాష్ట్రం మారనుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం నాడు ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజక వర్గం వేంసూర్ మండలం కల్లూరు గూడెం వద్ద కొత్తగా నిర్మాణం చేస్తున్న పామాయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి తో కలసి పరిశీలించారు.

-ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో పామాయిల్ సాగు విస్తరణలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచామని వెల్లడించారు. దేశ వ్యాప్తంగా 15 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగులో ఉండగా నూనె గింజలు ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే 70 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు విస్తరణ చేయాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా 36 శాతం సాగు విస్తరణతో దేశంలోనే తెలంగాణ తొలి స్థానంలో నిలిచిందని మంత్రి తుమ్మల సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది భారత దేశం వంట నూనెల దిగుమతులు కోసం లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేసి నూనెలు దిగుమతి చేసుకునే పరిస్థితులు ఉండగా కేంద్ర ప్రభుత్వం పామాయిల్ ఇంపోర్ట్ టాక్స్ 44 శాతం పెంచితే దేశీయంగా రైతాంగానికి మద్దతు ధరలు పెరుగుతాయని స్వయం సమృద్ధి సాధించాలంటే కేంద్ర ప్రభుత్వం ఇంపోర్ట్ టాక్స్ పెంచాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మరియు ప్రహ్లాదజోషి లను ఇటీవల డిల్లీలో కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరపున విజ్ఞప్తి చేసినట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. ప్రస్తుతం పామాయిల్ ఫ్రూట్ బంచ్ టన్ను గెలలు ధర 23,852 రూపాయలు ఉందని, కనీస గ్యారంటీ ధర పాతిక వేల రూపాయలు గా కేంద్రం ప్రకటించాలని కోరినట్లు గుర్తు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు పామాయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు ఉండగా సిద్దిపేట జిల్లా నర్మెట్ట లో పామాయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ రైతులకు అందుబాటులో ఉండగా ఖమ్మం జిల్లాలో కల్లూరు గూడెం ..కొణిజర్ల గద్వాల జిల్లా బీచ్ పల్లి ములుగు జిల్లా ఇంచర్ల పెద్దపల్లి వనపర్తి జిల్లాల్లో పామాయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని మంత్రి తుమ్మల తెలిపారు. ఈ ఫ్యాక్టరీ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి ఆగస్టు మాసంలో రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా అధికారులు కృషి చెయ్యాలని ఆదేశించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో రైతు భరోసా రైతు భీమా పథకం ఉచిత విద్యుత్ సరఫరా తో పామాయిల్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పది లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు విస్తరణ చేస్తే తెలంగాణ లో గ్రీన్ కవర్ పెరగటంతో పాటు రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో పామాయిల్ సాగు ముఖ్య భూమిక వహించ నున్నని అని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా రైతులు పామాయిల్ సాగు చేపట్టాలని మంత్రి తుమ్మల రైతాంగాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పద్ధతి మార్చుకోండి లేదంటే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవు రౌడీషీటర్లకు డీఎస్పీ అరుణ్ కుమార్ కౌన్సిలింగ్..




హంసకలం వార్త

భద్రాచలం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు డీఎస్పీ అరుణ్ కుమార్ శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్ల ప్రవర్తన, ప్రస్తుతం వారు అనుసరిస్తున్న జీవన విధానంపై డీఎస్పీ ఆరా తీశారు. అలాగే, వారు ఏయే కేసుల్లో నిందితులుగా ఉన్నారో వివరాలు తెలుసుకుని, భవిష్యత్‌లో వారి ప్రవర్తన ఎలా ఉండాలనే అంశంపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ, పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గత నేరాలను పూర్తిగా విడనాడి, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలని రౌడీషీటర్లకు సూచించారు. వారి కదలికలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంటుందని, ప్రతి ఒక్కరూ తమ ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలని సూచించారు. పట్టణంలో ఎలాంటి అలజడి సృష్టించకుండా శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించే వారిని రౌడీషీటర్ల జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. లేనిపక్షంలో చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ నాగరాజు, ఎస్ఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# బిజినెస్

## రెండో రోజు లాభాల్లోనే




ముంబై:
అంతర్జాతీయ మార్కెట్లో తగ్గుతున్న ముడి చమురు ధరలు, ప్రపంచ మార్కెట్లలో ర్యాలీ నేపథ్యంలో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ పెరిగి దేశీయ ప్రామాణిక సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీలు వరుసగా రెండో రోజూ లాభాలను నమోదు చేశాయి. గురువారం బీఎ సఈ సెన్సెక్స్ 109.25 పాయింట్లు పెరిగి 77,100.47 వద్ద ముగిసింది. ఎన్ఎ?సఈ నిఫ్టీ 34.35 పాయింట్ల లాభంతో 24,056 వద్ద క్లోజైంది. ఆటో, ఏవియేషన్, బ్యాంకింగ్ షేర్లు లాభపడ్డాయి. సెన్సెక్స్‌లో 19 షేర్లు నష్టపోగా 11 షేర్లు పెరిగాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 811.96 పాయింట్లు పెరిగి డే గరిష్ఠ స్థాయి 77803.18ని తాకింది. అయితే ఐటీ, మెటల్ షేర్లలో లాభాల స్వీకరణ కారణంగా ద్వితీయార్ధంలో లాభాలు తగ్గిపోయాయి. నేడు మార్కెట్లు పని చేయవు: మొహర్రం సందర్భంగా శుక్రవారం స్టాక్, మనీ, కమోడిటీస్ మార్కెట్లు పని చేయవు.

## వెనెజువెలాలో భారీ భూకంపాలు-భారత్‌కు సమస్యలు తప్పవా




వెనెజువెలాలో ఇటీవల సంభవించిన రెండు భారీ భూకంపాలు అక్కడి ప్రజల జీవితాలను అతలాకుతలం చేశాయి. ఒక్క నిమిషం వ్యవధిలో రెండు తీవ్ర భూకంపాలు రావడంతో భారీ ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించాయి. ఈ భూకంపాల ప్రభావం వెనెజువెలాకు 14 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న భారత్‌పై కూడా తీవ్రంగా పడనుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారుఇటీవలి కాలంలో వెనెజువెలా నుంచి భారత్ చమురు దిగుమతులను గణనీయంగా పెంచింది. పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో భారత చమురు శుద్ధి సంస్థలు ఇటీవల వెనెజువెలా నుంచి ముడి చమురు కొనుగోళ్లను పెంచాయి. ఏప్రిల్, మే నెలల్లో భారత్‌కు ప్రధాన చమురు సరఫరాదారుల్లో ఒకటిగా వెనెజువెలా ఎదిగింది. ఈ పరిస్థితుల్లో భూకంపం వల్ల అక్కడి ఎగుమతి వ్యవస్థకు అంతరాయం కలిగితే భారత్‌పై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. భూకంపం కారణంగా వెనెజువెలా నౌకాశ్రయాల కార్యకలాపాలు దెబ్బతినడం, విద్యుత్ అంతరాయాలు, రవాణా వ్యవస్థలో సమస్యలు, అత్యవసర ఆంక్షలు అమలులోకి రావడం వల్ల చమురు ట్యాంకర్ల రాకపోకలు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. దీంతో సరుకు రవాణా ఖర్చులు, బీమా ప్రీమియంలు, నౌకల నిరీక్షణ వ్యయాలు పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. భారత ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీ విదేశ్‌కు వెనెజువెలా చమురు ప్రాజెక్టుల్లో పెట్టుబడులు ఉన్నాయి. భూకంప ప్రభావం ఎక్కువకాలం కొనసాగితే ఆ పెట్టుబడుల నిర్వహణ, ఉత్పత్తి కార్యకలాపాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

## టర్బో పెట్రోల్, అడుగు భాగంలో సీఎన్‌జీ సిలిండర్

### మారుతి బ్రెజ్జా సరికొత్తగా




మారుతి సుజుకి తన అత్యంత ప్రజాదరణ పొందిన ఎస్‌యూవీ బ్రెజ్జాను సరికొత్తగా తీర్చిదిద్దుతోంది. దీన్ని త్వరలోనే భారత మార్కెట్లో విడుదల చేయనుంది. అధికారిక ప్రకటన రాకపోయినా టెస్టింగ్ సందర్భంగా పలుసార్లు కనిపించిన ఈ వాహనంలో డిజైన్‌తో పాటు ఇంజిన్, ఫీచర్లలో కీలక మార్పులు ఉండనున్నట్లు తెలుస్తోంది. కొత్త బ్రెజ్జాలో ప్రస్తుతం ఉన్న 1.5 లీటర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్‌తో పాటు 1.0 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్ కూడా అందుబాటులోకి రానుంది. ఇదే ఇంజిన్‌ను ప్రస్తుతం ఫ్రాంక్స్‌లో ఉపయోగిస్తున్నారు. దీన్ని బ్రెజ్జా కోసం మరింత శక్తిమంతంగా ట్యూన్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. సీఎన్‌జీ వేరియంట్‌లో కూడా పెద్ద మార్పు తీసుకురానున్నట్లు సమాచారం. సిలిండర్‌ను బూట్ స్పేస్‌లో కాకుండా వాహనం అడుగు భాగంలో అమర్చనున్నారు. దీంతో లగేజీ పెట్టుకునేందుకు మరింత స్థలం లభిస్తుంది. ఫీచర్ల పరంగా వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఇవి టాప్ వేరియంట్లలో అందుబాటులో ఉండే అవకాశం ఉంది. అలాగే పవర్ అడ్జస్టబుల్ ఫ్రంట్ సీట్లు కూడా తొలిసారిగా బ్రెజ్జాలో ఇవ్వనున్నట్లు సమాచారం.

## వరల్డ్ నం.1 బౌలర్ కావడంపై స్పందించిన శ్రీ చరణి

స్పోర్ట్స్ డెస్క్:
ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్2026లో సరికొత్త రికార్డులతో భారత్ స్టార్ స్పిన్నర్ శ్రీ చరణి దూసుకుపోతుంది. ఇటీవల అంతర్జాతీయ క్రికెట్ మండలి ప్రకటించిన టీ20 ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నంబర్ వన్ బౌలర్‌గా అవతరించిన విషయం తెలిసిందే. దీనిపై శ్రీ చరణి స్పందిస్తూ.. ప్రస్తుతానికి తన దృష్టంతా ప్రపంచకప్ గెలవడం పైనే ఉందని స్పష్టం చేసింది. ఒకే ప్రపంచకప్ ఎడిషన్‌లో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా ఆమె(12*) సరికొత్త చరిత్ర సృష్టించింది. ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో షోర్ణా అక్తర్ వికెట్ తీయడం ద్వారా శ్రీ చరణి ఈ టోర్నీలో తన 11వ వికెట్‌ను ఖాతాలో వేసుకుంది. తద్వారా 2020 ప్రపంచ కప్‌లో పూనమ్ యాదవ్ (10 వికెట్లు) పేరిట ఉన్న భారత రికార్డును ఈ 21 ఏళ్ల యువ స్పిన్నర్ బద్దలు కొట్టింది. ఈ సందర్భంగా ఓతో ఆమె మాట్లాడుతూ.. 'ప్రస్తుతం నా దృష్టి పూర్తిగా ప్రపంచకప్‌పైనే ఉంది. వ్యక్తిగత ర్యాంకింగ్స్ సంతోషాన్ని ఇస్తాయి, కానీ అవి నా ప్రాధాన్యత కాదు. సరైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేస్తూ జట్టుకు విజయాన్ని అందించడమే నా కర్తవ్యం' అని పేర్కొంది. బంగ్లాదేశ్ మ్యాచ్‌లో తన బౌలింగ్‌లో మూడు క్యాచ్‌లు చేజారినప్పటికీ ఒత్తిడికి లోనవ్వలేదని, క్యాచ్‌లు జారడం ఆటలో భాగమేనని పరిణతితో కూడిన సమాధానమిచ్చింది. షఫాలీ వర్మ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో బంగ్లాదేశ్‌పై గెలిచిన భారత్, గ్రూప్-ఎలో రెండో స్థానంలో నిలిచి సెమీస్ అవకాశాలను మెరుగుపరుచుకుంది. తదుపరి జరగబోయే ఆస్ట్రేలియా మ్యాచ్ అత్యంత కీలకమైనదని, అయితే తాము ఎలాంటి అదనపు ఒత్తిడి లేకుండా ఎప్పటిలాగే ప్రణాళికలను పక్కాగా అమలు చేస్తామని చరణి ధీమా వ్యక్తం చేసింది.




## నెట్స్‌లో సీనియర్లను వణికించేస్తున్న వైభవ్- వీడియో వైరల్

స్పోర్ట్స్ డెస్క్:
భారత క్రికెట్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అరంగేట్రంపై ఉత్కంఠ కొనసాగుతోంది. కోచింగ్ సిబ్బంది నుంచి కూడా స్పష్టత రాలేదు. కానీ, తాజాగా బీసీసీఐ తన సోషల్ మీడియా ఖాతాలో పెట్టిన వీడియో మాత్రం క్రికెట్ ప్రియులను ఖుషీ చేస్తోంది. ఆ వీడియోతో వైభవ్ డెబ్యూ చేయడం ఖాయమనే భరోసా ఫ్యాన్స్‌కు వచ్చింది. మరి.. బీసీసీఐ రిలీజ్ చేసిన ఆ వీడియో ఏమిటో ఇప్పుడు చూద్దాం...బీసీసీఐ విడుదల చేసిన వీడియోలో నెట్స్‌లో సీనియర్ బౌలర్ల బౌలింగ్‌లో వైభవ్ భారీ షాట్లు కొడుతున్నాడు. ప్రత్యేకించి అతను ఆడుతున్న 'నో-లుక్ షాట్' అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. వైభవ్ ప్రాక్టీస్ వీడియోలు ఏకంగా బీసీసీఐనే పోస్టు చేయడంతో ఇవాళ్టి మ్యాచ్‌లో అతడి అరంగేట్రం ఖాయమని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఒకవేళ అతడిని ఎంపిక చేస్తే.. ఎవరిని పక్కన పెడతారనేది ఆసక్తికరంగా మారింది. కాగా, ఈ సంచలన ఆటగాడిపై ఐర్లాండ్ వికెట్ కీపర్ బెన్ కాలిట్జ్ స్పందిస్తూ.. 'మాతో ఎవరు ఆడినా ఒకేలా చూస్తాం. విరాట్ కోహ్లీనా.. శ్రేయస్ అయ్యరా.. లేదా సూర్యవంశీనా అనే సంగతి పక్కన పెడతాం. ప్రతి ఒక్కరితోనూ మెరుగైన క్రికెట్ ఆడేందుకు మాత్రమే ప్రయత్నిస్తాం. వారి ఆటతీరును నిశితంగా గమనించి.. అందుకు తగినట్లుగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటాం. మ్యాచ్ సమయంలోనూ వ్యూహాలు మారిపోతూ ఉంటాయి. టీమిండియా ప్రపంచ ఛాంపియన్ జట్టు. కానీ, వారిలోనూ కొన్ని బలహీనతలు ఉంటాయి. వాటిని ఆసరా చేసుకొని విజయం సాధించేందుకు ప్రయత్నిస్తాం' అని కాలిట్జ్ వ్యాఖ్యానించాడు.




# స్పోర్ట్స్

## ఇంగ్లండ్ టూర్ కు టీమిండియా ఎంపిక పై రవిశాస్త్రి ఏమన్నాడంటే...!



ఇంగ్లండ్‌తో జరగనున్న వైట్-బాల్ సిరీస్ కోసం ప్రకటించిన భారత జట్టు యువత, అనుభవం కలబోతతో ఆదర్శవంతంగా ఉందని టీమిండియా మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి విశ్వాసం వ్యక్తం చేశాడు. సవాలుతో కూడిన ఇంగ్లీష్ పరిస్థితుల్లో రాణించే సత్తా ఈ జట్టుకు ఉందని ధీమాగా చెప్పాడు. త్వరలో జరగనున్న ఈ పర్యటన నేపథ్యంలో, టీ20 జట్టుకు నాయకత్వం వహిస్తున్న శ్రేయస్ అయ్యర్ పై శాస్త్రి ప్రశంసలు కురిపించాడు. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌తో మాట్లాడుతూ, "ఈ కొత్త భారత జట్టులో యువత, అనుభవం అద్భుతంగా మేళవించాయి. టీ20 క్రికెట్‌లో శ్రేయస్ అయ్యర్ బలమైన ఆటగాడు. అతనికి కెప్టెన్సీ ఇవ్వడం నాకు ఆనందంగా ఉంది. అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, రవి బిష్ణోయ్, ప్రసిద్ధ్ కృష్ణ వంటి యువ ఆటగాళ్ల నుంచి అద్భుత ప్రదర్శనలు ఆశిస్తున్నాను" అని శాస్త్రి తెలిపాడు. ఇక టీ20 జట్టుకు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా, తిలక్ వర్మ వైస్-కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఈ జట్టులో అభిషేక్ శర్మ, రవి బిష్ణోయ్, ప్రసిద్ధ్ కృష్ణ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, హర్షిత్ రాణా, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ వంటి వారికి చోటు దక్కింది. మరోవైపు, వన్డే జట్టులోకి సీనియర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, జస్‌ప్రీత్ బుమ్రా తిరిగి వచ్చారు. తొడ కండరాల గాయం నుంచి కోలుకున్న కోహ్లీ ఈ సిరీస్‌తో పునరాగమనం చేయనుండగా, బుమ్రా పేస్ విభాగానికి నాయకత్వం వహిస్తాడు.

# ‘బాహుబలి 3’ వస్తుందా? ప్రభాస్, రానా, అనుష్క హింట్‌తో అభిమానుల్లో జోష్

-‘బాహుబలి 3’పై మళ్లీ మొదలైన ఊహాగానాలు
-డాక్యుమెంటరీలో మూడు వేళ్లు చూపిన ప్రభాస్
-రానా వ్యాఖ్యలు, అనుష్క స్పందన వైరల్
-‘అండ్ ది లెగసీ కంటిన్యూస్’ సందేశంతో పెరిగిన ఆసక్తి
-అధికారిక ప్రకటన మాత్రం ఇంకా చేయని రాజమౌళి బృందం



‘బాహుబలి 3’పై మళ్లీ చర్చ మొదలైంది. తాజాగా విడుదలైన ‘బాహుబలి: ది టార్చ్‌బేరర్’ డాక్యుమెంటరీలో ప్రభాస్, రానా దగ్గుబాటి, అనుష్క శెట్టి చేసిన వ్యాఖ్యలు, ఎక్స్‌ప్రెషన్స్ మూడో భాగం రానుందనే సంకేతాలుగా అభిమానులు భావిస్తున్నారు. నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన ‘బాహుబలి: ది టార్చ్‌బేరర్’ డాక్యుమెంటరీ లో రానా దగ్గుబాటి మాట్లాడుతూ “ప్రపంచం ఇంకా సిద్ధంగా లేకపోవచ్చు. కానీ బాహుబలి..” అని చెప్పగా, వెంటనే ప్రభాస్ మూడు వేళ్లు చూపిస్తూ చిరునవ్వు చిందించాడు. పక్కనే ఉన్న అనుష్క శెట్టి కూడా నవ్వడంతో ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చివర్లో ‘అండ్ ది లెగసీ కంటిన్యూస్’ అనే సందేశం కనిపించడం మరింత ఆసక్తిని పెంచింది. ఈ క్లిప్‌ను చూసిన అభిమానులు ‘బాహుబలి 3 అధికారికంగా వస్తోంది’ అంటూ సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. అయితే దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి గానీ, చిత్ర బృందం గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. మరోవైపు ‘బాహుబలి: ది టార్చ్‌బేరర్’ నాలుగు భాగాల డాక్యుమెంటరీ జూన్ 26 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతోంది. బాహుబలి చిత్రాల నిర్మాణం, వాటి వెనుక కథలు, ప్రపంచవ్యాప్తంగా సాధించిన విజయాలను ఇందులో చూపించారు. 2015లో విడుదలైన ‘బాహుబలి: ది బిగినింగ్’, 2017లో వచ్చిన ‘బాహుబలి: ది కన్‌క్లూజన్’ భారతీయ సినీ చరిత్రలో సంచలన విజయాలు సాధించాయి. ప్రభాస్‌ను పాన్ ఇండియా స్టార్‌గా నిలబెట్టిన ఈ ఫ్రాంచైజీకి ఇప్పటికీ భారీ అభిమాన వర్గం ఉంది. ఇప్పుడు మూడో భాగంపై వస్తున్న సంకేతాలు అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి.

## సమంత గర్భవతి అనే విషయం నాకు మాత్రమే తెలుసు: నందినీ రెడ్డి



స్టార్ హీరోయిన్ సమంత, డైరెక్టర్ నందిని రెడ్డి కాంబినేషన్‌కు టాలీవుడ్‌లో ఎంతటి క్రేజ్ ఉందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ‘జబర్దస్త్’, ‘ఓ బేబీ’ సినిమాల తర్వాత వీరిద్దరి కాంబోలో వచ్చిన ‘మా ఇంటి బంగారం సినిమా’ కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూశారు. ఆ ఎదురు చూపులకు తగ్గట్టుగానే ఆ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి పాజిటివ్ టాక్ తో దూసుకుపోతోంది. తాజాగా ఓ పాడ్‌కాస్ట్ షోలో పాల్గొన్న నందిని రెడ్డి.. సమంత ప్రెగ్నెన్సీ గురించి ఆసక్తికరమైన విషయాలు బయట పెట్టారు. ఎన్టీవీ పాడ్‌కాస్ట్ షోలో నందిని రెడ్డి మాట్లాడుతూ... సినిమా షూటింగ్ సమయంలో జరిగిన సీక్రెట్‌ను షేర్ చేసుకున్నారు. “మా ఇంటి బంగారం షూటింగ్ శరవేగంగా జరుగుతున్న సమయంలోనే.. సమంత గర్భవతి అయిందనే విషయం తెలిసింది. ఆ టైమ్‌లో ఆ గుడ్ న్యూస్ సెట్‌లో ఒక్క నాకు మాత్రమే తెలుసు. వేరే ఎవరికీ ఈ విషయం లీక్ కాకుండా జాగ్రత్త పడ్డాం” అని తెలిపారు. “లక్కీగా అప్పటికే చిత్రానికి సంబంధించిన హెవీ యాక్షన్ సీక్వెన్స్‌లు మొత్తం కంప్లీట్ చేసేశాం. దాంతో పెద్దగా ఇబ్బంది పడలేదు. కానీ ఆ తర్వాత మిగిలిన షూటింగ్ పార్ట్ మొత్తం సమంత హెల్త్‌ను దృష్టిలో పెట్టుకుని ప్లాన్ చేశాం. ఆమెకు ఎక్కడా స్ట్రెయిన్ అవ్వకుండా, కొంచెం ఎక్కువ రెస్ట్ ఇస్తూనే మిగతా షూటింగ్‌ను సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేశాం” అని నందిని రెడ్డి చెప్పుకొచ్చారు.

## కెరీర్ ప్రారంభంలో ఎన్నో ఇబ్బందులు పడ్డాను: కృతి సనన్




కృతి సనన్ ఇటీవల ‘కాక్‌టెయిల్-2’తో బాలీవుడ్‌లో భారీ హిట్ సాధించింది. ప్రస్తుతం తెలుగు సినిమా పరిశ్రమ నుంచి బంపర్ ఆఫర్ అందుకుంది. విజయ్ దేవరకొండ, శౌర్యవ్‌తో కలిసి పాన్ ఇండియా స్థాయి చిత్రంలో కీలక పాత్రలో నటించనుందనే వార్త హల్‌చల్ చేస్తోంది. మరోవైపు, ఓ ఇంటర్వ్యూలో కృతి తన 12 ఏళ్ల సినిమా ప్రయాణం గురించి మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యింది. “ప్రారంభంలో చాలా కష్టాలు పడ్డాను. మోడలింగ్ రోజుల్లో నా మొదటి ఫొటో షూట్, మొదటి ర్యాంప్ వాక్ రెండూ పూర్తిగా ఫ్లాప్ అయ్యాయి. ఇంటికి వెళ్లి ఏడ్చాను. కానీ ఆపకుండా మళ్లీ ఆడిషన్లు చేశాను. ఆ పట్టుదలే నన్ను ఇక్కడి వరకు తీసుకొచ్చింది” అని గుర్తు చేసుకుంది. అంతేకాదు, బాలీవుడ్‌లోని నెపోటిజం పైనా కృతి తీవ్రంగా స్పందించింది. రణ్‌బీర్ కపూర్, అలియా భట్ లాంటి స్టార్ కిడ్స్ లో టాలెంట్ ఉందని, కష్టపడి నిరూపించుకున్నారని చెప్పిన కృతి... టాలెంట్ లేని కొందరు కేవలం ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ కారణంగా 8-9 ఏళ్ల పాటు వరుసగా అవకాశాలు పొందడం అన్యాయమని మండిపడింది. బ్యాక్‌గ్రౌండ్ లేని నటీనటులు మొదటి 2-3 ఏళ్లలోనే హిట్‌లు కొట్టకపోతే ఇండస్ట్రీ వారిని పక్కకు నెట్టేస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# విజయ్ 6 కారవాన్లు, 50 మంది అసిస్టెంట్లను అడిగాడనేది ఫేక్: మైత్రి రవిశంకర్

-విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కాంబినేషన్లో తెరకెక్కుతున్న ‘రణబాలి’
-ప్రొడక్షన్ విషయంలో విజయ్ హద్దులు దాటారంటూ ప్రచారం
-విజయ్ చాలా ప్రొఫెషనల్ గా వ్యవహరించే హీరో అన్న రవిశంకర్

టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ తాజా చిత్రం ‘రణబాలి’ చుట్టూ సోషల్ మీడియాలో పుకారు చక్కర్లు కొడుతోంది. షూటింగ్ సెట్స్‌లో విజయ్ హద్దు దాటి ప్రవర్తిస్తున్నాడని, తన కోసం ఏకంగా 5 నుండి 6 కారవాన్లు, 40-50 మంది అసిస్టెంట్లను డిమాండ్ చేశాడంటూ ప్రచారం జరుగుతోంది. అంతేకాదు, ఈ ఖర్చు భరించలేక నిర్మాతలు ‘ప్రొడ్యూసర్స్ కౌన్సిల్’ను ఆశ్రయించారనే వార్తలు కూడా వైరల్ అయ్యాయి. ఈ తప్పుడు ప్రచారంపై చిత్ర నిర్మాత, మైత్రి మూవీ మేకర్స్ అధినేత వై. రవిశంకర్ మీడియా ద్వారా స్పందించారు. విజయ్ దేవరకొండ అత్యంత ప్రొఫెషనల్‌గా వ్యవహరించే హీరో అని. షూటింగ్‌లో ఇప్పటివరకు ఎలాంటి సమస్యలు తలెత్తలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ వార్తలన్నీ కేవలం కొందరు కావాలనే క్రియేట్ చేసినవని చెప్పారు. అటు విజయ్ పీఆర్ టీమ్ కూడా ఈ రూమర్లను సృష్టించిన బాధ్యులపై సైబర్ క్రైమ్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చింది. ఇక రూమర్ల సంగతి పక్కనబెడితే.. ‘రణబాలి’ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు ఉన్నాయి. ‘శ్యామ్ సింగరాయ్’ ఫేమ్ రాహుల్ సాంకృత్యాయన్ డైరెక్షన్‌లో... 1854 నుంచి 1878 మధ్య కాలంలో బ్రిటిష్ పాలన నాటి వాస్తవ చారిత్రక సంఘటనల ఆధారంగా ఈ పీరియడ్ డ్రామా తెరకెక్కుతోంది. బ్లాక్ బస్టర్ హాలీవుడ్ మూవీ ‘ది మమ్మీ’ విలన్, నటుడు ఆర్నాల్డ్ వోస్లూ ఇందులో మెయిన్ విలన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ సరసన ఆయన భార్య రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తోంది. ‘గీత గోవిందం’, ‘డియర్ కామ్రేడ్’ చిత్రాల తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న మూడో సినిమా ఇది. అంతేకాదు, వీరిద్దరి వివాహం జరిగిన తర్వాత స్క్రీన్ షేర్ చేసుకుంటున్న మొదటి ప్రాజెక్ట్ ఇదే కావడం వల్ల ఫ్యాన్స్‌లో ఈ కాంబో క్రేజ్ నెక్స్ట్ లెవెల్‌కు వెళ్ళింది.




# ‘తుక్రా కే మేరా ప్యార్ 2’ ( జియో హాట్ స్టార్) మూవీ రివ్యూ!

హిందీ నుంచి వచ్చిన డ్రామా సిరీస్ లలో ‘తుక్రా కే మేరా ప్యార్’ సిరీస్ కి ప్రత్యేకమైన స్థానం ఉంది. సంచితా బసు - ధవళ్ ఠాకూర్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సిరీస్ మొదటి సీజన్ కి విశేషమైన స్పందన లభించింది. ఆర్థికపరమైన అంతరం ఇద్దరు ప్రేమికులను ఎలా విడదీసింది? వాళ్ల మధ్య శత్రుత్వానికి ఎలా కారణమైంది? అనే అంశం చుట్టూ అల్లుకున్న కథ ఇది. నటన పరంగా సంచితా బసుకి మంచి మార్కులు పడిపోయాయి. అలాంటి ఈ సిరీస్ నుంచి సీజన్ 2 రూపొందింది. ఈ నెల 19వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. సీజన్ 2 నుంచి ముందుగా 4 ఎపిసోడ్స్ ను వదిలారు. కుల్దీప్ కుమార్ (ధవళ్ ఠాకూర్) శాన్విక చౌహాన్ (సంచిత బసు) ప్రేమించుకుంటారు. డబ్బు .. పలుకుబడి ఉన్న మనోహర్ సింగ్, వాళ్ల ప్రేమను తిరస్కరిస్తాడు. ఆయన కారణంగా కుల్దీప్ కి ప్రమాదం ఉందని భావించిన శాన్విక, కుల్దీప్ కుమార్ మనసు విరిగిపోయేలా చేస్తుంది. ఆ కసితోనే అతను కలెక్టర్ అవుతాడు. తన అధికారాలను ఉపయోగించి శాన్విక కుటుంబాన్ని ఇబ్బంది పెట్టాలనుకుంటాడు. అయితే రాజకీయ పరమైన ముఠాపరమైన కక్షల కారణంగా శాన్విక తన తండ్రిని భర్తను కోల్పోతుంది. ఈ సంఘటనలలో కుల్దీప్ హస్తం ఉందని ఆమె అపార్థం చేసుకుంటుంది. శాన్విక తన తండ్రి స్థానంలో రాజకీయాలలో ముందుకు దూసుకు వెళుతుంటుంది. ‘సితారా పూర్’ ప్రజలంతా ఆమెను ఎంతగానో అభిమానిస్తూ ఉంటారు. శాన్వికపై మనసు పారేసుకున్న ‘కున్వర్’ ఆమెకి సహాయం చేస్తున్నట్టుగా నటిస్తూ, చేరువ కావడానికి ప్రయత్నిస్తుంటాడు. అతని ఉద్దేశాన్ని అర్థం చేసుకున్న శాన్విక, నమ్మినట్టుగా నటిస్తుంటుంది. ఇక శాన్విక కారణంగా తన కూతురు జీవితం ప్రమాదంలో పడుతుందని భావించిన దద్దూ మహారాజ్, ఆమెకి హాని తలపెట్టడానికి సన్నాహాలు మొదలుపెడతాడు.



Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449